Place your advertisements on website

https://rajadhanivartalu.com
call us at whatsapp

94406 62699

# రాజధాని వార్తలు

# RAJADHANI VARTALU




అమరావతి సంపుటి (Vol) : 7 సంచిక (Issue): 319 పేజీలు (Pages): 8 వెల: రూ. 2.00 ఆంధ్రప్రదేశ్ 'రాజధాని' తొలి తెలుగు దినపత్రిక (Andhra Pradesh Capital's First Telugu Daily)

గురువారం, 6 - 8 - 2026

94406 62699 rajadhanivartalu rajadhaniv www.rajadhanivartalu.com NI No.: APTEL/2019/77985 Postal regd: GTR/114/2025-27 స్థాపితం : 2015

## ఏ పీ ఎం ఎస్ డి పి జే ఏ లోగోను ఆవిష్కరించిన మంత్రి కొలుసు పార్థసారధి



విజయవాడ, (రాజధాని వార్తలు): ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సమాచార పౌర సంబంధాల శాఖమంత్రి కొలుసు పార్థసారధి విజయవాడలోని క్యాంపు కార్యాలయంలో ఆంధ్రప్రదేశ్ మీడియం స్మాల్ డెయిలీ & పీరియాడికల్స్ జర్నలిస్టుల అసోసియేషన్ లోగోను బుధవారం ఆవిష్కరించారు. చిన్న పత్రికల జర్నలిస్టుల సంఘం ఏర్పడిన సందర్భంగా మంత్రి లోగోను ఆవిష్కరించి, సంఘం ఏర్పాటులో కృషి చేసిన వారికి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా సంఘం అధ్యక్షులు పి. హుస్సేన్ ఖాన్, కార్యదర్శి కలిమిశ్రీ చిన్న పత్రికల్లో పని చేస్తున్న జర్నలిస్టులు ఎదుర్కొంటున్న అనేక సమస్యలపై మంత్రికి వినతిపత్రం అందజేశారు.

## ప్రధాని మోదీకి క్షమాపణ చెప్పిన మెటా సీఈఓ జుకర్‌బర్గ్



ఇంటర్నెట్ డెస్క్: ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి సంబంధించిన వీడియో తొలగింపుపై మెటా దిగొచ్చింది. ఈ మేరకు మెటా సీఈఓ మార్క్ జుకర్‌బర్గ్.. ప్రధాని మోదీకి క్షమాపణలు చెప్పారు. సీఎస్ఏఎమ్, డీప్‌ఫేక్ కంటెంట్ వ్యాప్తిపై విచారం వ్యక్తం చేసిన మెటా.. కొన్ని రకాల కంటెంట్‌ను బూస్ట్ చేయడానికి భారీగా డబ్బులు తీసుకున్నట్టు అంగీకరించింది. అంతే కాకుండా తమ ఫ్లాట్‌ఫామ్ నిర్వహణలో జరిగిన పొరపాట్లను కూడా అంగీకరించింది మెటా. కాగా.. ప్రధాని మోదీకి సంబంధించిన జులై 23 నాటి వీడియోను తొలగించడానికి కారకులైన వారిపై చర్యలు తీసుకోవాలని మెటాను పార్లమెంటరీ కమిటీ బుధవారం ఆదేశించిన సంగతి తెలిసిందే. ఈ ఘటనకు సంబంధించి బాధ్యులపై చర్యలు తీసుకోవడం సహా బహిరంగంగా క్షమాపణ చెప్పాలని మూడు రోజుల అల్టిమేటం జారీ చేసింది. ఈ మేరకు దిగొచ్చిన మెటా.. మోదీని క్షమాపణలు చెప్పింది.

## విజయ్ ఎందుకు మౌనంగా ఉన్నారు : ఉదయనిధి స్టాలిన్

చెన్నై: తమిళనాడు ప్రతిపక్ష నేత, డీఎంకే నాయకుడు ఉదయనిధి స్టాలిన్ తన అరెస్టుపై మరోసారి విమర్శలు చేశారు. తన అరెస్టు పూర్తిగా రాజకీయ ఉద్దేశాలతో జరిగిందని, ప్రజల దృష్టిని అసలు సమస్యల నుంచి మళ్లించేందుకే ఇలా చేశారని ఆరోపించారు. అలాగే ముఖ్యమంత్రి విజయ్ ఈ అంశంపై ఇప్పటికీ ఎందుకు స్పందించడం లేదని ప్రశ్నించారు. త్రిషపై వ్యాఖ్యల నేపథ్యంలో ఉధయనిధిని పోలీసులు మంగళవారం అదుపులోకి తీసుకుని విచారించిన సంగతి తెలిసిందే. మంగళవారం హైడ్రామా తర్వాత తమిళనాడు ముఖ్యమంత్రి విజయ్, ప్రతిపక్ష నాయకుడు ఉదయనిధి స్టాలిన్ బుధవారం అసెంబ్లీకి హాజరయ్యారు. 'రాష్ట్రంలో కావేరి జల వివాదం, మేకేదాటు ప్రాజెక్టు, రైతుల సమస్యలు వంటి కీలక అంశాలపై ప్రభుత్వం సమాధానం చెప్పాల్సి ఉంది. ఈ సమయంలో నా అరెస్టు పెద్ద రాజకీయ అంశంగా మారింది. ప్రజల దృష్టిని మళ్లించడమే ఈ చర్య వెనుక ఉన్న ఉద్దేశం' అని ఉదయనిధి ఆరోపించారు. తన అరెస్టుపై ముఖ్యమంత్రి మౌనం వహించడాన్ని ఉదయనిధి ఎద్దేవా చేశారు. అలాగే 'నేను ద్వంద్వార్థాలు వాడానని కొందరు ఆరోపించారు. నేను ఒకే అర్థంతో మాట్లాడాను. రైతులకు నీరు కావాలి. దాని గురించే నేను మాట్లాడాను. మహిళలను అగౌరవపరిచే ఉద్దేశం నాకు ఎంతమాత్రం లేదు. తమిళనాడులోని ప్రతి తల్లిని, సోదరిని నేను నా సొంత కుటుంబంగా భావిస్తాను' అని ఉదయనిధి పేర్కొన్నారు.



## ఇంటర్ కాలేజీలకు ఫైర్ ఎన్‌ఓసి తప్పనిసరి: ఇంటర్ బోర్డు సెక్రటరీ అభిలాష అభినవ్




హైదరాబాద్, (రాజధాని వార్తలు): ఇంటర్మీడియట్ కాలేజీలకు ఫైర్ ఎన్‌ఓసి కంపల్సరీ చేశామని ఇంటర్మీడియట్ బోర్డు సెక్రటరీ అభిలాష అభినవ్ తెలిపారు. ఇంటర్మీడియట్ బోర్డుకు వచ్చిన కొన్ని ఫైర్ ఎన్‌ఓసిలను హైడ్రాతో సంప్రదించి పరిశీలించగా, కొన్ని సర్టి ఫికెట్లు బోగస్‌గా ఉన్నట్లు గుర్తించామన్నారు. హైడ్రాకు వచ్చిన దరఖాస్తుల వివరాలు ఇంటర్మీడియట్ బోర్డుకు అందడంతో నకిలీ సర్టిఫికెట్ల వ్యవహారం వెలుగులోకి వచ్చిందని ఆమె చెప్పారు. ప్రస్తుతం ఫేక్ ఎన్‌ఓసిల వ్యవహారంపై విచారణ కొనసాగుతోందని, విచారణ పూర్తయిన తర్వాత ఎన్ని నకిలీ సర్టిఫికెట్లు సమర్పిం చారనే విషయం స్పష్టమవుతుందని తెలిపారు.


**ఫేక్ ఎన్‌ఓసిలపై కఠిన చర్యలు**

నకిలీ ఫైర్ ఎన్‌ఓసిల విషయంలో హైడ్రా, ఇంటర్మీడియట్ బోర్డు సీరియస్‌గా ఉన్నాయని అభిలాష అభినవ్ వెల్లడించారు. ఈ వ్యవహారంపై ఇంటర్మీడియట్ బోర్డు స్థాయిలో అంతర్గత విచారణ కూడా చేపడుతున్నట్లు తెలిపారు. నిబంధనలు ఉల్లంఘించిన కాలేజీలపై తగిన చర్యలు తీసుకునే అవకాశం ఉందని పేర్కొన్నారు.

**విద్యార్థులు ఆందోళన చెందొద్దు**

ఫేక్ ఎన్‌ఓసిల వ్యవహారంపై విద్యార్థులు, తల్లిదండ్రులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని ఇంటర్మీడియట్ బోర్డు స్పష్టం చేసింది. విద్యార్థులకు ఎలాంటి నష్టం కలగకుండా అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటామని అభిలాష అభినవ్ తెలిపారు. కాలేజీల అనుమతులకు సంబంధించిన పూర్తి వివరాలు అధికారిక వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉన్నాయని, తల్లిదండ్రులు ఏవైనా సందేహాలు ఉంటే వెబ్‌సైట్ ద్వారా తనిఖీ చేసుకోవచ్చని సూచించారు. ఈ విద్యా సంవత్సరానికి సంబంధించి 3 వేలకుపైగా ఇంటర్మీడియట్ కాలేజీలు అనుమతులు పొందినట్లు ఇంటర్మీడియట్ బోర్డు సెక్రటరీ అభిలాష అభినవ్ తెలిపారు.


## విశాఖ ఎకనామిక్ రీజియన్ ప్రాజెక్టుపై సీఎం చంద్రబాబు స్పెషల్ ఫోకస్



అమరావతి, (రాజధాని వార్తలు): విశాఖపట్నం ఎకనామిక్ రీజియన్ అభివృద్ధి ప్రణాళికలపై ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు బుధవారం రాష్ట్ర సచివాలయంలో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో పలు కీలక అంశాలపై అధికారులకు సీఎం దిశానిర్దేశం చేశారు. వివిధ రంగాల్లో కీలకమైన ప్రాజెక్టుల ద్వారా రూ. 9.50 లక్షల కోట్ల పెట్టుబడులను ఆకర్షించేలా విశాఖపట్నం ఎకనామిక్ రీజియన్ ప్రాజెక్టు చేపట్టినట్లు తెలిపారు. రూ. 3.50 నుంచి రూ. 4 లక్షల కోట్ల మేర ప్రభుత్వ పెట్టుబడులు పెడుతున్నట్లు వెల్లడించారు. ప్రైవేట్ రంగం నుంచి రూ. 5.30 లక్షల కోట్లు రాబట్టేలా కార్యాచరణ రూపొందిస్తున్నట్లు తెలిపారు. బేసిటీ ప్రాజెక్ట్ యాంకర్ ప్రాజెక్టుగా పెట్టుకుని విశాఖపట్నం రీజియన్ అభివృద్ధి చేపట్టాలని ప్రభుత్వం ఆలోచిస్తోందని సీఎం చంద్రబాబు వ్యాఖ్యానించారు. సూక్ష్మస్థాయి ప్రణాళిక ద్వారా విశాఖపట్నం రీజియన్ మొత్తం అభివృద్ధి చేయాలన్నదే వీఈఆర్ ప్రాజెక్టు లక్ష్యమని స్పష్టం చేశారు. వీఈఆర్ పరిధిలో ఉన్న ప్రతి ప్రాంతాన్ని, ప్రతి రంగాన్ని పరిగణనలోకి తీసుకుని అభివృద్ధి ప్రణాళికలను సిద్ధం చేయాలని ఆదేశించారు. ఏఐ డేటా సెంటర్ల ఎకో సిస్టం, పోర్టు ఆధారిత పరిశ్రమలు, టూరిజం, హైడ్రోజన్, క్లీన్–టెక్ ఎనర్జీలపై దృష్టి సారించాలని అన్నారు. మూలపేట పోర్టు నుంచి రాజమహేంద్రవరం అఖండ గోదావరి ప్రాజెక్టు వరకూ వీఈఆర్ అభివృద్ధిలో భాగంగా ఉండాలని సీఎం సూచించారు. వివిధ ప్రాజెక్టులను అనుసంధానించటం ద్వారా విశాఖపట్నం ఎకనామిక్ రీజియన్ ప్రగతి సాధించాలని సీఎం చంద్రబాబు స్పష్టం చేశారు. నిధుల కన్వర్జెన్స్ ద్వారా వీఈఆర్ పరిధిలో అభివృద్ధి చేపట్టాలని సూచించారు. అవసరమైన మేరకు వీజీఎఫ్ స్కీంను అమలు చేయాలని తెలిపారు. ఈ సమీక్షకు సీఎస్ సాయిప్రసాద్, ఆర్థిక, పరిశ్రమలు, పురపాలక, అటవీ, ఇంధన, పర్యాటక శాఖల ఉన్నతాధికారులు హాజరయ్యారు.

## దేశంలో ఎక్కడా బీసీల కోసం ప్రత్యేక చట్టం లేదు : మంత్రి అచ్చెన్నాయుడు

అమరావతి, (రాజధాని వార్తలు): బీసీల కోసం ప్రత్యేక చట్టమంటూ దేశంలో ఎక్కడా లేదని మంత్రి అచ్చెన్నాయుడు అన్నారు. బుధవారం బీసీ రక్షణ చట్టంలోని వివరాలను మీడియాకు మంత్రి వెల్లడించారు. బీసీల కోసం కొత్తగా తెచ్చే చట్టంపై రెండేళ్ల నుంచి తీవ్ర కసరత్తు చేశామని తెలిపారు. 2019–24 కాలంలో బలహీన వర్గాలపై కక్షకట్టి దమనకాండ చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. బలహీనవర్గాల కోసం ప్రత్యేక చట్టం తీసుకొస్తామని మేనిఫెస్టోలో పెట్టామని అన్నారు. సమస్యల పరిష్కారానికి సబ్‌కమిటీ కూడా నియమించామన్నారు. సమాజంలో బలహీనవర్గాలకు ఉన్న సమస్యలపై సుదీర్ఘంగా చర్చించామని తెలిపారు. బీసీలకు రిజర్వేషన్లు కల్పించింది అన్న ఎన్టీఆర్ అని..ఆ రిజర్వేషన్లను 27 శాతానికి పెంచింది చంద్రబాబు నాయుడు అని మంత్రి చెప్పుకొచ్చారు. రాష్ట్రంలో బలహీన వర్గాలు 70 శాతం మంది ఉన్నారని తెలిపారు. శాసనసభ్యుల అభిప్రాయాలే కాకుండా అందరి ఆమోదం కావాలన్నారు. శాసనసభలో డ్రాఫ్ట్ బిల్లును ఆమోదించే ముందు కేంద్ర జాతీయ బీసీ కమిషన్ సలహాలు కూడా తీసుకుంటున్నామని చెప్పారు. ఈ చట్టాన్ని అన్ని విధాల అమలులోకి తీసుకు రావడానికి ప్రయత్నాలు చేస్తామన్నారు. జిల్లాల వారీగా బలహీనవర్గాల సంఘాలతో మాట్లాడాలని సబ్ కమిటీకి చెప్పామని తెలిపారు. కొత్త చట్టాన్ని ప్రజలకు వివరించి సలహాలు తీసుకోవాలని ఆదేశించామని చెప్పారు. టీడీపీ వెన్నంటే ఉంది బలహీన వర్గాలే అని మంత్రి అచ్చెన్నాయుడు పేర్కొన్నారు.



# 12వ జాతీయ చేనేత దినోత్సవ వేడుకలు



**అమరావతి, (రాజధాని వార్తలు):** భారత ప్రభుత్వ జౌళి మంత్రిత్వ శాఖ, డెవలప్‌మెంట్ కమిషనర్ (చేనేత) కార్యాలయం పరిధిలోని చేనేత సేవా కేంద్రం, విజయవాడ ఆధ్వర్యంలో 12వ జాతీయ చేనేత దినోత్సవం-2026 సందర్భాన్ని పురస్కరించుకుని అమరావతిలోని నేషనల్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ డిజైన్, ఆంధ్రప్రదేశ్‌లో 05 ఆగస్టు 2026న సాయంత్రం 04:00 గంటలకు ఒక ప్రత్యేక కార్యక్రమం. 1905 నాటి చారిత్రాత్మక స్వదేశీ ఉద్యమాన్ని స్మరించుకోవడానికి మరియు దేశ సాంస్కృతిక జౌళి వారసత్వాన్ని పరిరక్షించడంలో భారతీయ చేనేత నేతకారుల అమూల్యమైన రంగాన్ని గుర్తించడానికి ప్రతి సంవత్సరం ఆగస్టు 7న జాతీయ చేనేత దినోత్సవాన్ని జరుపుకుంటారు. అసలైన చేనేత ఉత్పత్తులపై అవగాహన పెంచడం, సాంప్రదాయ నేత రీతులను అభినందించేలా యువతను ప్రోత్సహించడం మరియు చేనేత వస్త్రాల వినియోగాన్ని పెంపొందించడం ఈ వేడుకల ముఖ్య ఉద్దేశం. ఎన్ఐడి, ఆంధ్రప్రదేశ్‌లో జరిగే ఈ కార్యక్రమంలో చేనేత ఉత్పత్తుల ప్రదర్శన, ప్రత్యక్ష నేత ప్రదర్శనలు, చేనేత క్విజ్ పోటీలు, డిజైన్ పోటీలు మరియు ఎన్ఐడి విద్యార్థులచే ఆకర్షణీయమైన చేనేత ఫ్యాషన్ షో / చీర కట్టుకునే పోటీలు నిర్వహించబడతాయి. ఈ కార్యకలాపాలు భారతీయ చేనేత రంగానికి చెందిన సౌందర్యాన్ని, నైపుణ్యాన్ని, ఆవిష్కరణలను మరియు సుస్థిరతను ప్రతిబింబించడంతో పాటు డిజైనర్లు, చేతివృత్తుల కళాకారులు, విద్యార్థులు మరియు చేనేత రంగానికి చెందిన ప్రజల మధ్య అనుసంధానాన్ని పెంచుతాయి. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరు కావాల్సిందిగా నేషనల్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ డిజైన్, ఆంధ్రప్రదేశ్ డైరెక్టర్ ని ఆహ్వానించడం జరిగింది. ఈ వేడుకల్లో 300 మందికి పైగా విద్యార్థులు, అధ్యాపకులు, అధికారులు, సిబ్బంది, చేనేత కార్మికులు, జౌళి మంత్రిత్వ శాఖ అధికారులు, చేనేత సంస్థల ప్రతినిధులు మరియు ఇతర విశిష్ట అతిథులు పాల్గొంటారని భావిస్తున్నారు. భారతదేశ సంపన్న చేనేత వారసత్వాన్ని పరిరక్షించడం, ప్రోత్సహించడం మరియు మద్దతు ఇవ్వడం అనే సందేశాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లడానికి ఈ కార్యక్రమం.

# న్యాయవాదుల రక్షణ బిల్లు ముసాయిదా రూపకల్పనకు గ్రీన్ సిగ్నల్

**- న్యాయ కార్యదర్శిని ఆదేశించిన న్యాయ శాఖ మంత్రి ఎన్ఎండి ఫరూక్**

**- న్యాయవాదుల రక్షణకు, సంక్షేమానికి కట్టుబడి ఉన్నాం : మంత్రి ఫరూక్ స్పష్టీకరణ**



**అమరావతి, (రాజధాని వార్తలు):** ఆంధ్రప్రదేశ్ న్యాయవాదుల రక్షణ బిల్లు-2026 (ఏపీ అడ్వకేట్స్ ప్రొటెక్షన్ బిల్-2026)ను రూపొందించడానికి కూటమి ప్రభుత్వం కార్యాచరణ చర్యలకు ఉపక్రమించింది. ముసాయిదాను వీలైనంత త్వరగా తయారు చేయాలని న్యాయశాఖ కార్యదర్శి ప్రతిభా దేవికి న్యాయ, మైనారిటీ శాఖల మంత్రి ఎన్ఎండి ఫరూక్ గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. ఈ మేరకు సంబంధిత అధికార యంత్రాంగంతో యుద్ధ ప్రాతిపదికన చర్చించి ముసాయిదా రూపకల్పనకు కార్యాచరణ చేపట్టాలని న్యాయశాఖ కార్యదర్శికి సూచన చేసినట్లు మంత్రి ఫరూక్ బుధవారం అమరావతిలో విడుదల చేసిన ఒక ప్రకటనలో వెల్లడించారు. ముసాయిదా బిల్లు తయారైన వెంటనే తదుపరి చర్యల కోసం రాష్ట్ర అడ్వకేట్ జనరల్‌తో పాటు ఆర్థిక శాఖ రిమార్కులను పరిగణలోకి తీసుకొని బిల్లు ఆమోదం కోసం మంత్రి మండలి సమావేశం ముందుకు తీసుకువెళ్లడం జరుగుతుందని మంత్రి తెలిపారు. న్యాయవాదుల సంక్షేమానికి, రక్షణకు ముఖ్యమంత్రి చంద్రబాబు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని స్పష్టం చేశారు. రాష్ట్రంలో మరణించిన 1173 మంది న్యాయవాదుల కుటుంబాలకు ఒక్కొక్కరికి రూ. 4 లక్షలు ప్రకారం మొత్తం రూ. 46.92 కోట్లు ఆర్థిక సాయం ను కూటమి ప్రభుత్వం విడుదల చేసిన విషయాన్ని మంత్రి ఫరూక్ గుర్తు చేశారు.

# ప్రజల ప్రభుత్వం టిడిపి ప్రభుత్వం

**- ఇంటింటి ప్రచారంలో తిరుపతి పార్లమెంట్ అధికార ప్రతినిధి అబ్దుల్ రహీమ్**

**గూడూరు, (రాజధాని వార్తలు):** ప్రజల సంక్షేమమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని ఇచ్చిన హామీలను నెరవేరుస్తున్న ప్రభుత్వం ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నాయకత్వంలో టిడిపి ప్రభుత్వమని ఆ ప్రభుత్వాన్ని ఆదరించాలని ఇంటింటి టిడిపి కార్యక్రమంలో తిరుపతి పార్లమెంటు జిల్లా అధికార ప్రతినిధి అబ్దుల్ రహీం తెలిపారు. గత 5 రోజులుగా జరుగుతున్న ఇంటింటింటికి టీడీపీ ప్రచారంలో భాగంగా ఎస్.ఆర్.ఎ. టాకీస్ వెనుక వైపు వీధిలో బి.సి. కాలనీ 20వ సచివాలయం వద్ద సిమెంట్ రోడ్‌లు కావాలని అక్కడ స్థానిక ప్రజలు టీడీపీ అధికార ప్రతినిధి అబ్దుల్ రహీమ్‌కి తెలియచేయగా, ఆయన ఈ విషయం ఎమ్మెల్యే పాశిం సునీల్ కుమార్ దృష్టికి తీసుకెళ్లగా, స్పందించిన ఎమ్మెల్యే మునిసిపల్ కమీషనర్ చెప్పి ఎస్టిమేషన్ వేసి ఆ రెండు రోడ్‌లు వేయమని ఆదేశించడం జరిగింది. నేడు మునిసిపల్ సిబ్బంది వచ్చి ఆ రెండు రోడ్‌లు ఎస్టిమేషన్ వేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో టీడీపీ అధికార ప్రతినిధి ఎం.డి.అబ్దుల్ రహీమ్, టీడీపీ స్థానిక నాయకులు పరమేశ్వర గౌడ్, ఉమామహేశ్వరరావు మోహన్, మునిసిపల్ టౌన్ ప్లానింగ్ సిబ్బంది పాల్గొన్నారు.



# జాతీయ అవార్డు అందుకున్న రాజన్న ఫౌండేషన్

**తిరుపతి, (రాజధాని వార్తలు):** సీఎస్ఆర్ టైమ్స్ ఆధ్వర్యంలో న్యూఢిల్లీలోని లీ మెరిడియన్ హోటల్‌లో మంగళవారం నిర్వహించిన 13వ జాతీయ కార్పొరేట్ సామాజిక బాధ్యత & పర్యావరణ, సామాజిక, సుపరిపాలన సదస్సు మరియు అవార్డులు-2026లో గ్రామీణ & మౌలిక సదుపాయాల అభివృద్ధి (గ్రామాభివృద్ధి) విభాగంలో రాజన్న ఫౌండేషన్ ప్రతిష్ఠాత్మక జాతీయ అవార్డును అందుకుంది. ఈ అవార్డును రాజన్న ఫౌండేషన్ డైరెక్టర్ డాక్టర్ రమాదేవి గౌరీనేని భారతదేశంలోని రొమేనియా రాయబారి సెనా లతీఫ్, ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ కార్పొరేట్ అఫైర్స్ మాజీ డైరెక్టర్, ముఖ్య కార్యనిర్వాహణ అధికారి భాస్కర్ ఛటర్జీ చేతుల మీదుగా అందుకున్నారు. విద్య, ఆరోగ్యం, నైపుణ్యాభివృద్ధి, గ్రామీణ మౌలిక సదుపాయాల కల్పన, జీవనోపాధి, గ్రామాల సమగ్ర అభివృద్ధి రంగాల్లో రాజన్న ఫౌండేషన్ చేస్తున్న విశిష్ట సేవలకు గుర్తింపుగా ఈ అవార్డును ప్రదానం చేశారు. ఈ సందర్భంగా అమర రాజా గ్రూప్, రాజన్న ఫౌండేషన్ వ్యవస్థాపక ఛైర్మన్ గల్లా రామచంద్ర నాయుడు మాట్లాడుతూ, "గ్రామీణాభివృద్ధి పట్ల మా నిబద్ధతకు ఈ జాతీయ అవార్డు గుర్తింపుగా నిలిచింది. ఈ గౌరవాన్ని మా ఉద్యోగులు, భాగస్వాములు, గ్రామీణ ప్రజలకు అంకితం చేస్తున్నాం. సమగ్ర గ్రామీణాభివృద్ధి ద్వారా 'వికసిత్ భారత్-2047' లక్ష్య సాధనకు రాజన్న ఫౌండేషన్ తన సేవలను మరింత విస్తరిస్తుంది" అని అన్నారు. "సమ్మిళిత భారత నిర్మాణంలో బాధ్యతాయుత వ్యాపారాల పాత్ర" అనే అంశంతో నిర్వహించిన ఈ సదస్సులో వికసిత్ భారత్-2047 మరియు ఐక్యరాజ్యసమితి సుస్థిర అభివృద్ధి లక్ష్యాలు సాధనకు విశేష కృషి చేస్తున్న సంస్థలను సత్కరించారు.




# డీఎస్సీ అక్రమాలపై సీబీఐ విచారణ జరిపించాలి

**- వెంకటగిరి నియోజకవర్గ వైఎస్ఆర్సిపి సమన్వయకర్త డిమాండ్**



**తిరుపతి, (రాజధాని వార్తలు):** వెంకటగిరిలోని నేదురుమల్లి నివాసం ఎన్ జే ఆర్ భవన్లో మంగళవారం డీఎస్సీ అక్రమాలపై వెంకటగిరి నియోజకవర్గ వైయస్సార్సీపి సమన్వయకర్త నేదురుమల్లి రామ్ కుమార్ రెడ్డి ఆధ్వర్యంలో టౌన్ హాల్ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంకు విద్యార్థులు యువత పార్టీ శ్రేణులు అధిక సంఖ్యలో పాల్గొని డీఎస్సీలో జరిగిన అక్రమాలను వివరించారు. ఈ సందర్భంగా నేదురుమల్లి మాట్లాడుతూ ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు వెంటనే విడుదల చేసి విద్యార్థులు, తల్లిదండ్రుల ఇబ్బందులు తొలగించాలి తెలిపారు. ఎన్నికల్లో రూ.3,000 నిరుద్యోగ భృతి ఇస్తామని హామీ ఇచ్చిన చంద్రబాబు మాట తప్పి నిరుద్యోగులను మోసం చేశారు అని తెలిపారు. ఎన్నికల హామీలను అమలు చేయకుండా ప్రజలను తప్పుదోవ పట్టించడం చంద్రబాబు ప్రభుత్వానికి అలవాటైందని విమర్శించారు. ఎన్నికల్లో ఇచ్చిన ప్రతి హామీని అమలు చేయాలని వైఎస్సార్సీపీ పోరాటాలు కొనసాగిస్తుందని స్పష్టం చేశారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిల విడుదల, విద్యను కార్పొరేట్ వ్యాపారంగా మార్చవద్దన్న డిమాండ్‌తో ఏబీవీపీ రాష్ట్రవ్యాప్తంగా కళాశాలల బంద్‌కు పిలుపునివ్వడం ప్రభుత్వ వైఫల్యానికి నిదర్శనం అని తెలిపారు. 2024 కూటమి మేనిఫెస్టోలో ప్రధాని నరేంద్ర మోదీ, బీజేపీ కమలం గుర్తు లేకపోవడం చంద్రబాబుపై బీజేపీకే నమ్మకం లేదనే సంకేతమని తెలిపారు. పాలిటెక్నిక్ ప్రవేశాలను ఉద్దేశపూర్వకంగా ఆలస్యం చేయడంతో విద్యార్థులు ఇతర రాష్ట్రాలు, ఇతర కోర్సులకు వెళ్లిపోయారని, ఫలితంగా కేవలం 38% సీట్లు మాత్రమే భర్తీ అయ్యాయని ఆరోపించారు. విద్యార్థుల భవిష్యత్తును పణంగా పెట్టి ప్రభుత్వంపై ఆర్థిక భారం తగ్గించుకో వడమే ఈ ప్రభుత్వ లక్ష్యమా అని తెలిపారు. భోగాపురం అంతర్జాతీ య విమానాశ్రయానికి భూసేకరణ పూర్తి చేసి, రైతులకు పరిహారం చెల్లించి, 2026లో పూర్తి చేసేలా జీఎంఆర్‌తో ఒప్పందం కుదుర్చుకున్నది వైఎస్ జగన్ ప్రభుత్వమేనని స్పష్టం చేశారు. ఇప్పుడు భోగాపురం విమానాశ్రయం క్రెడిట్‌ను చంద్రబాబు తన ఖాతాలో వేసుకునే ప్రయత్నం చేస్తున్నారని తెలిపారు. వైఎస్ జగన్ రెడ్డి హయాంలో రెండు లక్షలకు పైగా సచివాలయ ఉద్యోగాలను పారదర్శకంగా భర్తీ చేశారని, ఒక్క అవకతవక కూడా జరగలేదని పేర్కొన్నారు.కూటమి ప్రభుత్వం నిర్వహించిన డీఎస్సీలో మాత్రం అవకతవకలు జరిగాయని ఆధారాలతో బయటపడుతున్నాయని తెలియపరిచారు. విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ నైతిక బాధ్యత వహిస్తూ వెంటనే రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. 1991లో ప్రతిపక్షంలో ఉన్న చంద్ర బాబు, నేదురుమల్లి జనార్దన్ రెడ్డి మెడికల్ కాలేజీల అంశంపై నైతిక బాధ్యత కోరిన విషయాన్ని గుర్తు చేశారు. వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు డీఎస్సీ అక్రమాలపై వైఎస్సార్సీపీ ఉద్యమాలు కొనసాగుతాయని స్పష్టం చేశారు. వెంకటగిరి, డక్కిలి, బాలాయపల్లి మండలాల్లో రిలే నిరాహార దీక్షలు నిర్వహిస్తామని వెల్లడించారు. ఈ నెల 10న కలువాయిలో భారీ ర్యాలీ నిర్వహించి శాంతియుతంగా నిరసన తెలియజేస్తామని ప్రకటించారు. ఈ కార్యక్రమంలో పలువురు వైఎస్ఆర్సిపి కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఎన్‌హెచ్-71కు ఇరువైపులా సర్వీస్ రోడ్లు నిర్మించాలి

**- ఎన్‌హెచ్ఏఐ చైర్మన్‌కు వినతిపత్రం సమర్పించిన ఎంపీ**



**తిరుపతి, (రాజధాని వార్తలు):** తిరుపతి జిల్లాలోని నాయుడు పేట మున్సిపాలిటీ పరిధిలో జాతీయ రహదారి 71పై పుదూరు జంక్షన్ నుంచి అన్నమేడు ఆర్అండ్‌బీ రోడ్డు జంక్షన్ వరకు ఇరువైపులా సర్వీస్ రోడ్లు నిర్మించాలని తిరుపతి ఎంపీ గురుమూర్తి జాతీయ రహదారుల ప్రాధికార సంస్థ చైర్మన్ సంతోష్ కుమార్ యాదవ్‌ను కోరారు. ఈ మేరకు మంగళవారం న్యూఢిల్లీలో ఆయనను కలిసి వినతిపత్రం సమర్పించారు. ఎంపీ గురుమూర్తితో కలిసి స్థానిక వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు కామిరెడ్డి రాజారెడ్డి,త్రిలోక్ చంద్రారెడ్డి ఆయనను కలిశారు. ఈ సందర్భంగా ఎంపీ గురుమూర్తి మాట్లాడుతూ నాయుడుపేట మున్సిపాలిటీ వేగంగా అభివృద్ధి చెందుతున్న పట్టణంగా మారుతోందని తెలిపారు. కొత్త కాలనీలు, వాణిజ్య సముదాయాలు, విద్యాసంస్థలు, ఆసు పత్రులు, ప్రభుత్వ కార్యాలయాలు పెద్ద సంఖ్యలో ఏర్పడుతున్న నేపథ్యంలో ఈ ప్రాంతంలో యాక్సెస్ కంట్రోల్ విధానంలో నిర్మించిన ఎన్‌హెచ్-71కు సర్వీస్ రోడ్లు లేకపోవడం వల్ల స్థానిక ప్రజలు తీవ్ర రవాణా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వివరించారు. సర్వీస్ రోడ్ల లేమి కారణంగా పట్టణం రెండు భాగాలుగా విడిపోయినట్లుగా పరిస్థితి ఏర్పడిందని, స్థానిక రహదారుల మధ్య అనుసంధానం దెబ్బతినడంతో ప్రజలు సమీప ప్రాంతాలకు చేరుకోవడానికి కూడా అనవసరంగా ఎక్కువ దూరం ప్రయాణించాల్సి వస్తోందని తెలిపారు. మున్సిపల్ రోడ్లు, ఆర్అండ్‌బీ రోడ్లు, అంతర్గత వీధులు జాతీయ రహదారితో సమర్థవంతంగా అనుసంధానం కాకపోవడం వల్ల నిత్య రాకపోకలు ఇబ్బందికరంగా మారడంతో పాటు అత్యవసర సేవల రాకపోకలపైనా ప్రతికూల ప్రభావం పడుతోందని పేర్కొన్నారు. భారతమాల పరియోజన కింద జాతీయ రహదారుల అభివృద్ధికి సంబంధించి ఎన్‌హెచ్ఏఐ 2019 అక్టోబర్ 30న జారీ చేసిన విధాన మార్గదర్శకాల ప్రకారం, జనావాస ప్రాంతాల్లో అవసరమైన చోట సర్వీస్ రోడ్లు నిర్మించాలని స్పష్టంగా పేర్కొన్న విషయాన్ని ఎంపీ చైర్మన్ దృష్టికి తీసుకెళ్లారు. పుదూరు జంక్షన్ నుంచి అన్నమేడు జంక్షన్ వరకు ఉన్న రహదారి పూర్తిగా నాయుడుపేట మున్సిపల్ పరిమితుల్లోనే ఉండటంతో ఈ మార్గదర్శకాలు ఈ ప్రాంతానికి పూర్తిగా వర్తిస్తాయని వివరించారు. అందువల్ల పుదూరు జంక్షన్ నుంచి అన్నమేడు ఆర్అండ్‌బీ జంక్షన్ వరకు ఎన్‌హెచ్-71కు ఇరు వైపులా నిరంతర సర్వీస్ రోడ్లు నిర్మించడంతో పాటు,వాటిని మున్సిపల్ రోడ్లు, ఆర్అండ్‌బీ రోడ్లు, అంతర్గత వీధులతో అనుసంధానించేలా తగిన ప్రవేశ, నిష్క్రమణ మార్గాలను ఏర్పాటు చేయాలని ఎంపీ గురుమూర్తి ఎన్‌హెచ్ఏఐ చైర్మన్‌ను విజ్ఞప్తి చేశారు. కాగా పూదురు జంక్షన్ నుండి అన్నమేడు వరకు సర్వీస్ రోడ్లు ఏర్పాటు చేయాలని తిరుపతి ఎంపీ మద్దెల గురుమూర్తి, స్థానిక వైసిపి నాయకులు కామిరెడ్డి రాజారెడ్డి త్రిలోక్ నాథ్ రెడ్డిలతో కలసి జాతీయ రహదారుల ప్రాధికార సంస్థ చైర్మన్ సంతోష్ కుమార్ యాదవ్‌ను కలిసి వినతిపత్రం ఇవ్వడంపై స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

# శ్రీ కుమార స్వామి వారి బ్రహ్మోత్సవాల ఏర్పాట్లను పరిశీలించిన కొట్టే సాయి ప్రసాద్

**శ్రీకాళహస్తి, (రాజధాని వార్తలు):** శ్రీకాళహస్తీశ్వర స్వామి వారి దేవస్థానం చైర్మన్ కొట్టే సాయి ప్రసాద్, దేవస్థానం కార్యనిర్వహణాధికారి బి.కె.వెంకటేశులుతో కలిసి విజ్ఞానగిరిపై వెలసి ఉన్న శ్రీ కుమార స్వామివారి బ్రహ్మోత్సవాల ఏర్పాట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా దేవస్థానం పరిసర ప్రాంతాల్లో జరుగుతున్న సుందరీ కరణ (బ్యూటిఫికేషన్) పనులను పరిశీలించారు. అలాగే విజ్ఞానగిరి చుట్టుపక్కల ఎలాంటి ఆక్రమణలు జరగకుండా దేవస్థానం ఏర్పాటు చేసిన ఫెన్సింగ్ పనులను పరిశీలించి, వాటి నిర్వహణపై అధికారులకు పలు సూచనలు చేశారు. రాబోయే బ్రహ్మోత్సవాలను దృష్టిలో ఉంచుకుని, భక్తుల రద్దీని సక్రమంగా నియంత్రించేందుకు దేవస్థానం ఆవరణలోనే క్యూలైన్లను ఏర్పాటు చేయాలని సూచించారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అన్ని ఏర్పాట్లు పకడ్బందీగా ఉండేలా సంబంధిత అధికారులను ఆదేశించారు. అదేవిధంగా భక్తులకు అవసరమైన తాగునీరు, విద్యుత్ వెలుగులు, పారిశుద్ధ్యం, భద్రతతో పాటు అన్ని మౌలిక సదుపాయాలను సమృద్ధిగా కల్పించాలని సూచించారు. బ్రహ్మోత్సవాలు విజయవంతంగా నిర్వహించేందుకు అధికారులు, సిబ్బంది సమన్వయంతో పనిచేయాలని చైర్మన్ ప్రత్యేకంగా అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో దేవస్థానం అధికారులు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.



# కరుమారమ్మ పొంగల్ మహోత్సవంలో పాల్గొన్న కాటంరెడ్డి, బియ్యపు

**శ్రీకాళహస్తి, (రాజధాని వార్తలు):** శ్రీకాళహస్తి పట్టణంలోని కొండమిట్టలో వెలసిన శ్రీశ్రీశ్రీ చంద్రకళ శాంతి రూపిని దేవి కరు మారమ్మ పొంగల్ మహోత్సవంలో మాజీ ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్ రెడ్డి కుమార్తె కాటంరెడ్డి పవిత్ర రెడ్డి బియ్యపు పాల్గొని అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంఆర్ మురళి యాదవ్, పటాన్ ఫరీద్, శ్రీవారి సురేష్, కళ్యాణ్, మహేష్, సర్వనా, శివ, ముని, చందు, రాజా, ప్రసాద్, గోపి, బాబు, అయ్యప్ప, వసంతరాజు, శంకర్, రమేష్ యాదవ్, ఎంఆర్ మహేష్, సుబ్బు, అనిల్ తదితరులు పాల్గొన్నారు.



# పడుగుపాడులో రెండేళ్లలో రూ.4.28 కోట్ల అభివృద్ధి

## - విలేజ్ హెల్త్ సెంటర్, సామాజిక వికాస భవనం ప్రారంభించిన ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి - సూపర్ సిక్స్ హామీలను సూపర్ హిట్ చేశాం... ప్రజల్లోకి అభివృద్ధి లెక్కలతోనే వెళ్తున్నాం - రూ.14 కోట్ల బుచ్చిరెడ్డిపాళెం రోడ్డు మౌలిక వసతుల ప్రాజెక్టుకు ఎన్‌హెచ్ఏఐ ఆమోదం

**కోవూరు, (రాజధాని వార్తలు):** కోవూరు నియోజకవర్గంలోని పడుగుపాడు పంచాయతీలో గత రెండేళ్లలో రూ.4.28 కోట్ల విలువైన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు అమలు చేశామని, ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను నెరవేర్చిన ధైర్యంతోనే ప్రజల ముందుకు వస్తున్నామని కోవూరు శాసనసభ్యులు వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం సాయంత్రం పడుగుపాడు పంచాయతీలోని చంద్రమౌళి నగర్‌లో నిర్వహించిన 'రెండేళ్ల నమ్మకం - అభివృద్ధి, సంక్షేమం' ఇంటింటి ప్రచార కార్యక్ర మంలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. అంతకుముందు రూ.23 లక్షలతో నిర్మించిన విలేజ్ హెల్త్ సెంటర్, రూ.3.50 లక్షలతో నిర్మించిన సామాజిక వికాస భవనాన్ని ప్రారంభించారు. అనంతరం ఇంటిం టికీ వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాల కరపత్రాలు పంపిణీ చేస్తూ ప్రజల సమస్యలను స్వయంగా అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి మాట్లాడుతూ, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆదేశాల మేరకు ప్రభుత్వం రెండేళ్లలో చేసిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రతి ఇంటికీ వెళ్లి వివరించడమే ఈ కార్యక్రమం ఉద్దేశమని తెలిపారు. ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం చేసిన పనులను వివరిం చడంతో పాటు ప్రజల అవసరాలను తెలుసుకుని రాబోయే మూడేళ్ల అభివృద్ధి కార్యాచరణను రూపొందించాలని పార్టీ నాయకులు, కార్యకర్తలకు సూచించారు. ప్రభుత్వం ఏం చేసిందని ప్రశ్నిస్తున్న ప్రతిపక్షాలు ముందుగా ఏం చేయలేదో ప్రజలకు చెప్పాలని అన్నారు. ఎన్నికల ముందు ఇచ్చిన సూపర్ సిక్స్ హామీలను రెండేళ్లలోనే దాదాపు పూర్తిస్థాయిలో అమలు చేసి సూపర్ హిట్ చేశామని ఎమ్మెల్యే తెలిపారు. తల్లికి వందనం, సామాజిక భద్రతా పెన్షన్ల పెంపు, మహిళలకు ఉచిత బస్సు





ప్రయాణం, దీపం-2, అన్నదాత సుఖీభవ, ఆటో సేవలో, మత్స్యకారుల సేవలో, అన్న క్యాంటీన్ల పునరుద్ధరణ, మెగా డీఎస్సీ ద్వారా 16 వేల ఉపాధ్యాయ నియామకాలు వంటి కార్యక్రమాలతో అన్ని వర్గాల ప్రజలకు ప్రభుత్వం అండగా నిలిచిందన్నారు. విద్యా రంగంలో సీఎస్ఆర్ నిధులు, వీపీఆర్ ఫౌండేషన్ సహకారంతో ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి ప్రత్యేక చర్యలు చేపడుతున్నామని తెలిపారు.

**పడుగుపాడులో రూ.4.28 కోట్ల అభివృద్ధి**

పడుగుపాడు పంచాయతీలో రెండేళ్లలో మొత్తం రూ.4.28 కోట్ల అభివృద్ధి పనులు చేపట్టినట్లు ఎమ్మెల్యే వెల్లడించారు. పంచాయతీరాజ్ శాఖ ద్వారా రూ.1.40 కోట్లతో ఏడు సీసీ రోడ్లు, విలేజ్ హెల్త్ సెంటర్, సామాజిక వికాస భవనం నిర్మించామని తెలిపారు. మరో రూ.20 లక్షలతో నిర్మిస్తున్న విలేజ్ హెల్త్ సెంటర్ త్వరలో పూర్తి కానుండగా, రూ.42 లక్షలతో పడుగుపాడు-3 సచివాలయం పరిధిలో మరో హెల్త్ సెంటర్ మంజూరైనట్లు చెప్పారు. కేఆర్ఆర్ నగర్‌లో షాదీ మంజిల్ ఏర్పాటుకు ప్రతిపాదనలు పంపినట్లు వెల్లడించారు. ఇరిగేషన్ శాఖ ద్వారా రూ.93.39 లక్షలతో స్లూయిస్‌లు, కల్వర్టులు, కాలువల పూడికతీత, రక్షణ గోడలు, సైడ్ స్లూయిస్‌ల నిర్మాణ పనులు చేపట్టినట్లు తెలిపారు. విద్యుత్ శాఖ ద్వారా రూ.51.55 లక్షలతో ట్రాన్స్‌ఫార్మర్లు, విద్యుత్ స్తంభాలు, కేబుల్స్, త్రీ-ఫేజ్ లైన్ల ఏర్పాటు చేసినట్లు వివరించారు. నుడా నిధులతో రూ.35 లక్షల వ్యయంతో సీసీ డ్రెయిన్లు నిర్మించామని చెప్పారు. ఆర్‌డబ్ల్యూఎస్ శాఖ ద్వారా రూ.47.25 లక్షలతో డ్రెయిన్లు, తాగునీటి సౌకర్యాలు, శానిటరీ కాంప్లెక్స్‌లు, అంగన్‌వాడీ కేంద్రాల్లో మరుగుదొడ్లు నిర్మించినట్లు తెలిపారు. సీఎస్ఆర్ నిధులతో వీపీఆర్ ఫౌండేషన్ ద్వారా పడుగుపాడు జెడ్పీహెచ్ఎస్ పాఠశాల అభివృద్ధికి రూ.25 లక్షల ప్రతిపాదనలు పంపామని, త్వరలో పనులు ప్రారంభమవుతాయని చెప్పారు. సొంత స్థలం ఉన్న 173 కుటుంబాలకు ఇళ్ల నిర్మాణం కోసం ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపినట్లు, ముఖ్యమంత్రి సహాయనిధి కింద 36 కుటుంబాలకు రూ.35.60 లక్షల ఆర్థిక సహాయం అందించినట్లు వెల్లడించారు.

**ప్రజల సమస్యలకు తక్షణ స్పందన**

ఇంటింటి ప్రచారం సందర్భంగా చంద్రమౌళి నగర్‌లో అంగన్‌వాడీ భవనం శిథిలావస్థలో ఉందని స్థానికులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. వర్షాకాలంలో చిన్నారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని వివరించగా, త్వరలోనే కొత్త భవనం నిర్మాణానికి చర్యలు తీసుకుంటానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. సీసీ డ్రెయిన్లు, రోడ్లు, వాటర్ ట్యాంక్ తదితర సమస్యల పరిష్కారానికి కూడా సంబంధిత అధికారులతో చర్చించి చర్యలు తీసుకుంటామని తెలిపారు.

**బుచ్చిరెడ్డిపాళెం రూ.14 కోట్ల ప్రాజెక్టుకు ఎన్‌హెచ్ఏఐ ఆమోదం**

కోవూరు నియోజకవర్గ అభివృద్ధికి మరో కీలక ముందడుగు పడిందని ఎమ్మెల్యే తెలిపారు. బుచ్చిరెడ్డిపాళెం మున్సిపాలిటీ పరిధిలో జాతీయ రహదారి-67పై రూ.14 కోట్లతో రోడ్డు మౌలిక వసతుల అభివృద్ధి పనులకు నేషనల్ హైవేస్ అథారిటీ ఆఫ్ ఇండియా ఆమోదం తెలిపిందని వెల్లడించారు.

ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి ఇటీవల చేసిన విజ్ఞప్తిపై స్పందించిన ఎన్‌హెచ్ఏఐ ఛైర్మన్ సంతోష్ కుమార్ యాదవ్ లోడ్ బేరింగ్ పేవర్ బ్లాక్స్, సీసీ డ్రెయిన్లు, విద్యుత్ లైన్ల తరలింపు పనులకు ఆమోదం తెలు పుతూ అధికారిక లేఖ పంపినట్లు తెలిపారు. ట్రాఫిక్ సమస్యలు, రోడ్డు ప్రమాదాల నివారణకు దోహదపడే ఈ ప్రాజెక్టుకు ఆమోదం తెలిపిన ఎన్‌హెచ్ఏఐ ఛైర్మన్ సంతోష్ కుమార్ యాదవ్‌కి, ప్రత్యేక చొరవ తీసుకున్న నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డికి ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి కృతజ్ఞతలు తెలిపారు.

# వెంకటేశ్వరపురం ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో కనీస వసతుల లేక రోడ్డు మీదకు వచ్చి వందలాది మంది విద్యార్థుల ధర్నా

## - సమస్యలు పరిష్కారం అయ్యే వరకు వారితో కలిసి పోరాడుతామన్న సంఘీభావం తెలిపిన ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్ రెడ్డి







**నెల్లూరు, (రాజధాని వార్తలు):** వెంకటేశ్వరపురం ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో తమ సమస్యల పరిష్కారం కోరుతూ విద్యార్థులు చేపట్టిన ధర్నాకు ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్ రెడ్డి సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థుల వద్దకు వెళ్లి నేరుగా మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు.

ప్రమాద భరితంగా కలుషిత త్రాగు నీరు : కళాశాలలో విద్యార్థులకు అందుతున్న తాగునీరు అపరిశుభ్రంగా ఉండటాన్ని గమనించి, దీనివల్ల ఎదురవుతున్న ఇబ్బందులపై విద్యార్థుల నుంచి వివరాలు తెలుసుకున్నారు.

ప్రహరీ గోడ లేక అసాంఘిక కార్యక్రమాలు : కళాశాలకు కనీస ప్రహరీ గోడ లేదా ఫెన్సింగ్ లేకపోవడంతో బయటి వ్యక్తులు విచ్చలవిడిగా కళాశాల ప్రాంగణంలోకి వచ్చి అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడుతున్నారని, తమ భద్రతకు తీవ్ర ముప్పు ఏర్పడుతోందని విద్యార్థినులు కన్నీటితో ఎమ్మెల్సీ దృష్టికి తీసుకువచ్చారు. పెచ్చులూడుతున్న తరగతి గదులు, అన్నంలో పురుగులు, చీకటి పడితే హాస్టల్‌లోకి పాములు, దుర్భరంగా సాగుతున్న ప్రతిష్ట కలిగిన పాలిటెక్నిక్ కళాశాలు దీనిపై స్పందించిన ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్ రెడ్డి కళాశాల ప్రిన్సిపల్‌ను కలిసి విద్యార్థుల సమస్యలను వెంటనే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి, తక్షణ చర్యలు చేపట్టి సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్ రెడ్డి మాట్లాడుతూ...సిఎస్ఆర్ నిధులతో అభివృద్ధి పేరుతో పబ్లిసిటీ స్టంట్స్ మంత్రి నారాయణ, మంత్రి లోకేష్‌లు సిఎస్ఆర్ నిధులతో నెల్లూరులో ఒకటి, రెండు పాఠశాలలను అభివృద్ధి చేస్తున్నామని గొప్పలు చెప్పుకుంటున్నారని, అయితే అనేక ప్రభుత్వ విద్యాసంస్థలు ప్రధానంగా ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల దుస్థితి వారికి కనిపించడం లేదా అని ప్రశ్నించారు. విద్యాసంస్థల అభివృద్ధిపై ప్రభుత్వం చేస్తున్న ప్రచారం కేవలం పబ్లిసిటీ స్టంట్ మాత్రమేనని, నిజంగా విద్యా రంగ అభివృద్ధిపై కూటమి ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేదన్నారు. గ్రౌండ్ లెవెల్‌లోకి వచ్చి వాస్తవ పరిస్థితులు పరిశీలించి మాట్లాడాలని సూచించారు.

**నాడు-నేడులోనే విద్యాసంస్థల అభివృద్ధి**

గత ప్రభుత్వ హయాంలో నాడు-నేడు కార్యక్రమం ద్వారా ఏర్పాటు చేసిన ఆర్ఓ ప్లాంట్లను ప్రస్తుతం వెయ్యి, పదిహేను వందల రూపాయలతో మరమ్మతు చేయవచ్చని తెలిసినా, వాటిని బాగు చేయాలనే కనీస ఆలోచన కూడా ప్రభుత్వానికి లేకపోవడం బాధాకరమన్నారు. వైయస్ జగన్మోహన్ రెడ్డి నాయకత్వంలో నాడు-నేడు కార్యక్రమం కింద రాష్ట్రవ్యాప్తంగా తొలి దశలో 20 వేల పాఠశాలలు, కళాశాలలు ఆధునీకరించబడ్డాయని, రెండో దశలో 18 వేల పాఠశాలల్లో సుమారు 80 శాతం పనులు పూర్తయ్యాయని గుర్తు చేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత నాడు-నేడు పనులను పూర్తిగా నిర్లక్ష్యం చేసిందని విమర్శించారు.

**కూటమి ప్రభుత్వంలో ప్రభుత్వ విద్యాసంస్థల పరిస్థితి అగమ్యగోచరం**

కూటమి ప్రభుత్వం వచ్చి రెండున్నర సంవత్సరాలు గడుస్తున్నా, నాడు-నేడు పేరును "మన బడి - మన భవిష్యత్తు "గా మార్చడం తప్ప విద్యాసంస్థల అభివృద్ధికి ఒక్క రూపాయి కూడా విడుదల చేశారా అని ప్రశ్నించారు. విద్యార్థులు, యువతను మోసం చేయడమే ప్రభుత్వ లక్ష్యంగా మారిందని మండిపడ్డారు.

**నెల్లూరు ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల దుస్థితి దయనీయం**

వెంకటేశ్వరపురం ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలకు ఒకప్పుడు మంచి పేరు ఉండేదని, అలాంటి ప్రతిష్ఠాత్మక విద్యాసంస్థలో నేడు విద్యార్థులు కనీస వసతుల కోసం ఇబ్బందులు పడటం బాధాకరమన్నారు. విద్యార్థులకు స్వచ్ఛమైన తాగునీరు కూడా అందించలేని పరిస్థితి నెలకొనడం దురదృష్టకరమని, కలుషితమైన నీటిని తాగుతూ విద్యార్థులు అనారోగ్య సమస్యల బారిన పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

**శుభ్రమైన త్రాగు నీరును కూడా ఇవ్వలేని ప్రభుత్వం**

కనీసం మున్సిపల్ నీటిని అందించాలని కానీ, ఉన్న =ా ప్లాంట్లు మరమ్మత్తులకు గురైతే వాటిని వెంటనే రిపేర్ చేయించే ఆలోచన కూడా ప్రభుత్వానికి లేకపోవడం విచారకరమన్నారు. ప్రభుత్వ విద్యాసంస్థలు ఎంత దుర్భర పరిస్థితిలో ఉన్నాయో చెప్పడానికి నెల్లూరు ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలే ప్రత్యక్ష ఉదాహరణ అని పేర్కొన్నారు. ముఖ్యంగా నెల్లూరు నగర నియోజకవర్గంలోని అనేక ప్రభుత్వ విద్యాసంస్థల్లో ఇదే పరిస్థితి కొనసాగుతోందని అన్నారు. వైఎస్సార్‌సీపీ విద్యార్థి విభాగం నగర నియోజకవర్గ అధ్యక్షుడు తౌఫిక్ విద్యార్థుల సమస్యలపై పోరాడుతున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో 11, 52, 53, 54 డివిజన్ ఇన్‌చార్జ్‌లు మహేష్ యాదవ్, మహబూబ్ బాషా, వెంగళరెడ్డి, మస్తాన్, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర జాయింట్ సెక్రటరీ బాలకృష్ణారెడ్డి, వైఎస్సార్‌సీపీ విద్యార్థి విభాగం జిల్లా అధ్యక్షుడు ఆశ్రిత్ రెడ్డి, విద్యార్థి విభాగం నగర అధ్యక్షుడు చంద్రారెడ్డి, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# "విద్య... వసతి.. వికాసం"లో దాతలు భాగస్వాములు కావాలి : జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్ల పిలుపు

## - పేద విద్యార్థుల మెరుగైన భవిష్యత్తుకు కలెక్టర్ వినూత్న ప్రయత్నం అభినందనీయం : ఎమ్మెల్యేలు సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి, కాకర్ల సురేష్, వెంకట కృష్ణారెడ్డి

**నెల్లూరు, (రాజధాని వార్తలు):** ప్రభుత్వ హాస్టళ్లలో చదువుకుంటున్న నిరుపేద విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తు కోసం జిల్లాలో వినూత్నంగా చేపట్టిన విద్య.. వసతి..వికాసం కార్యక్రమంలో జిల్లాలోని ప్రముఖ పారిశ్రామికవేత్తలు, స్వచ్ఛంద సంస్థలు, దాతలు కూడా తమ భాగస్వామ్యాన్ని పంచుకోవచ్చని, విద్యార్థులకు అవసరమైన వసతులు, సామాగ్రిని హాస్టళ్లకు సమకూర్చేందుకు స్వచ్ఛందంగా ముందుకు రావాలని కలెక్టర్ పిలుపునిచ్చారు. దాతలు అందించిన సామాగ్రి, పరికరాలపై వారి పేరును చిరస్థాయిగా నిలిచేలా పొందుపరుస్తామని చెప్పారు. మంగళవారం ఉదయం కలెక్టరేట్ లోని తిక్కన ప్రాంగణంలో విద్యా.. వసతి.. వికాసం కార్యక్రమాన్ని కలెక్టర్ లాంఛనంగా ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యేలు సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి, కాకర్ల సురేష్, వెంకట కృష్ణారెడ్డి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా ఈ కార్యక్రమం ఉద్దేశాన్ని జిల్లా బీసీ వెల్ఫేర్ అధికారి వెంకటలక్ష్మి క్లుప్తంగా వివరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని 155 ఎస్సీ, ఎస్టీ, బీసీ, గిరిజన, మైనారిటీ సంక్షేమ హాస్టళ్లు, గురుకుల పాఠశాలల్లో విద్యార్థులకు మెరుగైన వసతి సౌకర్యాలు కల్పించేం






దుకు రెండు నెలల ముందు నుంచే విద్యా.. వసతి.. వికాసం కార్యక్రమాన్ని ప్రారంభించేందుకు కసరత్తు చేపట్టినట్లు వివరించారు. జిల్లాలోని సీఎస్ఆర్ నిధులు, దాతల సౌజన్యంతో ఈ కార్యక్రమాన్ని చేపట్టనున్నట్లు కలెక్టర్ తెలిపారు. కమర్షియల్ టాక్స్, ఎక్సైజ్, మైనింగ్, పరిశ్రమల శాఖల అధికారులు తమ పరిధిలోని సంస్థలకు, ప్రముఖ వ్యక్తులకు ఈ కార్యక్రమం ఉద్దేశాన్ని వివరించి, వారిని ఇందులో భాగస్వామ్యం చేయాలని కోరారు. పేద బిడ్డలకు మంచి చేసే ఈ కార్యక్రమంలో ప్రతి ఒక్కరు తమ వంతు తోడ్పాటు అందించాలని కలెక్టర్ పిలుపునిచ్చారు. పేద విద్యార్థుల హాస్టళ్ళ అభివృద్ధికి సహకారం అందించాలనుకునే దాతలు dbcweo.nlr.18@gmail.com, cpo_nlr@yahoo.co.in ఈమెయిల్స్‌ను సంప్రదించాలని కోరారు. సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం పేద విద్యార్థుల విద్యాభివృద్ధికి అత్యంత ప్రాధాన్యత ఇస్తోందన్నారు. మంత్రి నారా లోకేష్ చొరవతో విద్యా రంగంలో పలు సంస్కరణలు అమలవుతున్నాయని, అదే స్ఫూర్తితో జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్ల హాస్టళ్ల అభివృద్ధికి "విద్య.. వసతి.. వికాసం" కార్యక్రమాన్ని ప్రారంభించడం అభినందనీయమన్నారు. ఈ గొప్ప కార్యక్రమానికి తమ వంతు సహకారం ఎల్లప్పుడూ ఉంటుందని తెలిపారు. కావలి శాసనసభ్యులు దగుమాటి వెంకటకృష్ణారెడ్డి కలెక్టర్ నిర్ణయాన్ని ప్రత్యేకంగా స్వాగతించారు. ఈ పథకం ద్వారా హాస్టళ్ల రూపురేఖలతో పాటు పేద విద్యార్థులకు మంచి వసతి సౌకర్యాలు లభిస్తాయని చెప్పారు. ఈ పథకంలో హాస్టళ్ల కాంపౌండ్ వాల్స్, హాస్టల్ ప్రాంగణాల్లో కాంక్రీట్ ఫ్లోరింగ్, సీసీ కెమెరాలు వంటి ఏర్పాట్లపై కూడా దృష్టి సారించాలని సూచించారు. ఉదయగిరి శాసనసభ్యులు కాకర్ల సురేష్ మాట్లాడుతూ కలెక్టర్ వినూత్న నిర్ణయం సర్వత్రా అభినందనీయమని కొనియాడారు. ఉదయగిరి నియోజకవర్గంలోని ఎస్సీ, ఎస్టీ హాస్టళ్లు, గండిపాళెం గురుకుల పాఠశాలలో మెరుగైన వసతులు లభిస్తాయని సంతోషం వ్యక్తం చేశారు. మరోసారి ఉదయగిరి నియోజకవర్గంలోని హాస్టళ్లలో మౌలిక వసతులను పూర్తిస్థాయిలో కల్పించేందుకు అధికారులు కృషి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డీఆర్వో విజయ్ కుమార్, డిప్యూటీ కలెక్టర్ కేశవర్ధన్ రెడ్డి, బీసీ వెల్ఫేర్ అధికారి వెంకటలక్ష్మి, ఎస్సీ వెల్ఫేర్ అధికారి శోభారాణి, ట్రైబల్ వెల్ఫేర్ అధికారి సుజాత, సంక్షేమ హాస్టళ్ల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# సంపాదకీయం

## బంకీపూర్: మోదీ సర్కార్‌కు మరో పాఠం


కాక్రోచ్ జనతా పార్టీ పేరిట దేశ రాజధాని ఢిల్లీలో వేలాది విద్యార్థులు, ఇతరేతర శక్తులు రగిల్చిన ఆందోళన చల్లారి వారం రోజులు దాటినప్పటికీ దాని ప్రకంపనలు ఇంకా సమసిపోలేదు. కేంద్ర విద్యామంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా తర్వాత పరిస్థితి పూర్తిగా సద్దుమణగడం లేదు. విద్యార్థులపై లాఠీచార్జి, పెల్లెట్లను ప్రయోగించినందుకు కేంద్ర హోంమంత్రి అమిత్ షా ప్రకటన చేయాలంటూ పార్లమెంటును ప్రతిపక్షాలు స్తంభింపజేస్తున్నాయి. చిన్నా చితక బిల్లులు తప్ప కీలక బిల్లులను ప్రవేశ పెట్టలేకపోతున్న ప్రభుత్వం సాధ్యమైనంత త్వరలో పార్లమెంటును నిరవధికంగా వాయిదా వేయాలని యోచిస్తున్నట్లు తెలుస్తోంది. విద్యార్థులపై లాఠీచార్జి దృశ్యాలు మాకెందుకు చూపిస్తున్నారు.. మా టైమ్ వేస్ట్ చేయకండి.. అని రెండు వారాల క్రితం వ్యాఖ్యానించిన సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ విద్యార్థులపై ఎఫ్ఐఆర్‌లను ఉపసంహరించుకునేందుకు ప్రభుత్వానికి వీలు కల్పిస్తున్నారు. కేంద్రమే ఈ విషయంలో సుప్రీంకోర్టును ఆశ్రయించినందువల్ల తలెత్తుకుని తిరిగే దారి ప్రభుత్వానికి ఆయన కల్పిస్తున్నట్లున్నారు. ఒకవైపు తన అభిమానులు, బీజేపీ నేతలు విద్యార్థులను రకరకాల పదజాలంతో దూషిస్తున్నప్పటికీ ప్రధానమంత్రి నరేంద్రమోదీ ఎంతో పెద్ద హృదయంతో వారిని తాను క్షమించానని ప్రకటించారు. అయినా ఈ ప్రకటన అనుకున్నంత సానుకూల ఫలితాలు ఇవ్వలేదు. పార్లమెంటుకు మోదీ, అమిత్ షాలు వస్తున్నారే కానీ ఉభయ సభలకు హాజరయ్యే సావకాశం వారికి లభించడం లేదు. ఆశ్చర్యకరమైనదేమంటే హోంమంత్రి అసలు నార్త్ బ్లాక్ (హోం మంత్రిత్వశాఖ నెలవు)కే రావడం లేదని, ఒకటి రెండు ముఖ్యమైన సమావేశాలు పార్లమెంటులో తన గదిలోనే నిర్వహిస్తున్నారని అధికారులే చెబుతున్నారు. ఈ సంక్షోభ సమయంలో మోదీని బాగా సంతోషపెట్టిన ఘటన ఒకటే. అది-- ఆంధ్రప్రదేశ్‌లో భోగాపురం విమానాశ్రయం ప్రారంభం సందర్భంగా ఆయనను నృత్యగీతాలతో, ప్రశంసల కుంభవృష్టితో అలరించడం! మళ్లీ ఢిల్లీ తిరిగి రాగానే పరిస్థితిలో అదే వేడి! ఈ సంక్షుభిత సమయం ఎంతకాలం ఉంటుందో తెలియదు కానీ, ఇదే సమయంలో వచ్చిన మూడు అసెంబ్లీ ఉప ఎన్నికల ఫలితాలు దేశ రాజకీయాలలో రాబోయే మార్పును సూచిస్తున్నాయని అనేక మంది పరిశీలకులు చెబుతున్నారు- ముఖ్యంగా బిహార్‌లోని బంకీపూర్ నియోజకవర్గ ఎన్నికల ఫలితాలు. బిహార్ రాజధాని పాట్నా సాహెబ్ లోక్‌సభా పరిధిలో ఒక నియోజకవర్గమైన బంకీపూర్ కాక్రోచ్ జనతా పార్టీ ఆందోళనకు కేంద్రంగా మారింది. ఇటీవల నీట్ ప్రశ్నపత్రాల లీక్ సందర్భంగా దేశవ్యాప్తంగా అనేక నగరాల్లో విద్యార్థులు వీధుల్లోకి రాగా, పాట్నాలో దాని ఉధృతి తీవ్రంగా కనిపించింది. కేంద్ర విద్యామంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామాను డిమాండ్ చేస్తూ బంకీపూర్‌లో కేంద్రీకృతమైన కాలేజీల్లో, హాస్టళ్లలో ఉన్న వేలాది విద్యార్థులు ఊరేగింపుగా దూసుకువచ్చారు. సిటీలో విద్యార్థులు కోచింగ్ తీసుకునే కేంద్రాలు అధికంగా ఉన్న అశోక్‌రాజ్‌పథ్, బోరింగ్ రోడ్లలో జనజీవనం స్తంభించిపోయింది. సివాన్, ఇతర కీలక జిల్లాల్లో నిరసన హింసాత్మకంగా మారింది. లాఠీచార్జిలు రాళ్లు రువ్వడం, బాష్పవాయువు, నీటి క్యానన్లను ప్రయోగించడం, పోలీసు జీపులను దహనం చేయడం, జాతీయ రహదారులను దిగ్బంధనం చేయడం వంటి సంఘటనలు జరిగాయి. ఏకే-47తో కాల్పులు జరపడంతో విద్యార్థులు గాయపడ్డ వీడియోలు ప్రచారమయ్యాయి. బంకీపూర్ సందుగొందుల్లో ఉన్న ప్రైవేట్ హాస్టళ్లలోకి పోలీసులు దూసుకుపోయి కోచింగ్ కోసం వచ్చిన విద్యార్థులను బయటకు లాగి చితకబాదారు. జూలై 25న ఇచ్చిన బిహార్ బంద్ సందర్భంగా ఒక్క రోజే 690 మందిని నిర్బంధించారు. అనేకమందిపై హత్యా నేరం క్రింద కేసులు మోపారు. ఆశ్చర్యకరమైన విషయం ఏమంటే బంకీపూర్ ఉప ఎన్నిక జూలై 30న కాగా జూలై 27న బిహార్ హోం విభాగం విద్యార్థులపై అన్ని ఎఫ్ఐఆర్ లను ఉపసంహరించుకుంటూ అత్యవసర ఆదేశాలు జారీ చేసింది. అయినా ఫలితం లేకపోయింది. 1974 మార్చిలో జయప్రకాశ్ నారాయణ్ నేతృత్వంలో పాట్నా యూనివర్సిటీ విద్యార్థులు అసెంబ్లీని ముట్టడించినప్పుడు పోలీసులు జరిపిన కాల్పులు, లాఠీచార్జిలో అనేకమంది విద్యార్థులు ప్రాణాలు కోల్పోయారు. ఆ తర్వాత గాంధీ మైదాన్‌లో లక్షలాది ప్రజల సమక్షంలో జరిగిన బహిరంగ సభలో జేపీ సంపూర్ణ క్రాంతికి పిలుపునిచ్చారు. బంకీపూర్‌లో అదే గాంధీ మైదానం పక్కనే ఉన్న చౌరస్తాలో నిర్మించిన జయప్రకాశ్ విగ్రహం ఇటీవలి సంఘటనలకు ప్రత్యక్ష సాక్షి. జేపీ గోలంబర్‌గా పిలిచే ఈ ప్రాంతం పరిసరాల్లోనే మళ్లీ విద్యార్థులపై పోలీసులు విరుచుకుపడ్డారు. ఎమర్జెన్సీకి ముందు జేపీ ఉద్యమం పాట్నా నుంచి ఢిల్లీకి పాకింది. ఇప్పుడు ఢిల్లీ నుంచి కాక్రోచ్ నిరసన పాట్నా వీధుల్లో ప్రతిధ్వనించింది. ఈ ప్రతిధ్వని బంకీపూర్ ఎన్నికల ఫలితాలను నిర్ణయించిందని చెప్పడంలో అతిశయోక్తి లేదు. గత మూడు దశాబ్దాలుగా బీజేపీ పట్టులో ఉన్న బంకీపూర్‌లో గెలిచింది, గత ఎన్నికల్లో అన్ని సీట్లూ కోల్పోయిన జన్ సురాజ్ పార్టీ నేత ప్రశాంత్‌కిశోర్ కాదు, విద్యార్థులు అని వేరే చెప్పనక్కర్లేదు. ఇక్కడి నుంచి అయిదుసార్లు గెలిచినందు వల్లే నితిన్ నబీన్ బీజేపీ జాతీయ అధ్యక్షుడు కాగలిగారు. ఆయన తన ఎమ్మెల్యే సీటు వదులుకుని రాజ్యసభను ఎంచుకోవడానికి కారణం అక్కడ అవలీలగా బీజేపీ గెలుస్తుందని ఆ పార్టీ అగ్రనేతలు భావించడమే. 'అక్కడ కుక్కను నిలబెట్టినా బీజేపీ గెలిపించుకుంటుంది..' అని కేంద్ర మాజీ మంత్రి రవిశంకర్ ప్రసాద్, పాట్నా ఎంపీ వ్యాఖ్యానించడమే ఇందుకు నిదర్శనం.


# రైతుల సంక్షేమమే కూటమి ప్రభుత్వ ధ్యేయం

## - ఒక ఎకరం ఎండకూడదు... ఒక ఎకరం మునగకూడదు

## - శహాపురం డ్రెయిన్ పనులను పరిశీలించిన ఎమ్మెల్యే పంతం నానాజీ







**కరప, (రాజధాని వార్తలు):** రైతుల సం క్షేమానికి కూటమి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యం ఇస్తోందని, "ఒక ఎకరం ఎండకూడదు... ఒక ఎకరం మునగకూడదు" అనే లక్ష్యంతో వ్యవసాయ రంగ అభివృద్ధికి చర్యలు చేపడుతున్నామని కాకి నాడ రూరల్ ఎమ్మెల్యే పంతం నానాజీ అన్నారు. మంగళవారం కరప మండల పరిధిలో శహాపురం డ్రెయిన్‌ను గొర్రిపూడి తుల్యభాగాన కలిసే మురుగు కాలువతో పాటు కొంగోడులో నిలిచిపోయిన బ్రిడ్జి పనులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పంటలకు సాగునీరు సక్ర మంగా అందించడంతో పాటు వరద ముప్పు నుంచి రైతులను రక్షించేందుకు స్థానిక ఇరిగేషన్ నిధులు, అత్యవసర గ్రాంట్లు, అవసరమైన చోట సొంత నిధులతో కాలువల పూడికతీత, మరమ్మతు పనులను యుద్ధప్రాతిపదికన చేపడుతున్నట్లు తెలిపారు. శహాపురం డ్రెయిన్‌లో పూడిక పేరుకుపోవడంతో కరప, వేములవాడ, కొంగోడు, వలసపాకల, పేపకాయల పాలెం, కూరాడ, వాకాడ తదితర గ్రామాల ఆయ కట్టుకు వరద ముప్పు ఏర్పడుతోందని పేర్కొన్నారు. గత అనుభవాలను దృష్టిలో ఉంచుకుని డ్రెయిన్ ఆక్రమణలను తొలగిస్తూ అసలు వెడల్పును పునరుద్ధరిస్తున్నామని చెప్పారు. డిస్ట్రిబ్యూటరీ కమిటీ చైర్మన్ పుణ్యమంతుల గంగ సత్యనారాయణ (పీజీ) ఆధ్వర్యంలో వారం రోజులుగా నిరంతరంగా శ్రమించి డ్రెయిన్ తవ్వకం పనులను పూర్తి చేసినట్లు ఎమ్మెల్యే తెలిపారు. రైతుల రాకపోకలకు అనువుగా డ్రెయిన్ గట్టుపై గ్రావెల్ రోడ్డు నిర్మాణానికి ప్రణాళికలు సిద్ధం చేశామని, సుమారు కిలోమీటరున్నర మేర అడ్డుగా ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు, షెడ్లను 15 రోజుల్లోగా తొలగించాలని అధికారులను ఆదేశించినట్లు వెల్లడించారు. రైతుల ప్రయోజనాల విషయంలో ఎలాంటి రాజీ ఉండదని స్పష్టం చేశారు. రైతు పండించిన ప్రతి గింజను కొనుగోలు చేయాలనే సంకల్పంతో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, మంత్రి నాదెండ్ల మనోహర్ నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం మద్దతు ధరతో పాటు అదనంగా రూ.50 నుంచి రూ.100 వరకు ప్రోత్సాహకంగా చెల్లిస్తూ ధాన్యం సేకరిస్తోందని ఎమ్మెల్యే పేర్కొన్నారు. గత నాలుగు పంటల ధాన్యాన్ని సకాలంలో కొనుగోలు చేసి రైతులకు ఆర్థిక భరోసా కల్పించామని, సంక్రాంతి నాటికి రైతుల ఇళ్లలో సిరులు నింపడమే ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు. ఈ కార్యక్రమంలో కరప డిస్ట్రిబ్యూటరీ కమిటీ చైర్మన్ పుణ్యమంతుల గంగ సత్యనారాయణ (పీజీ), మండల పార్టీ అధ్యక్షుడు బండారు మురళి, కూటమి నాయకులు భోగిరెడ్డి కొండబాబు, యాళ్ల వీర వెంకట సత్యనారాయణ (పండు), గండి వెంకటేశ్వరరావు, అనుకుల రాం బాబు, నక్కా బాబులు, దూడల నారాయుడు, జోకా అప్పలరాజు (తాతాజీ), ఎలుగుబంట్ల సూరి బాబు, మీసాల రాంబాబు, వనుం నారాయణరావు, ఆట్ల గోవిందు, వీరం రెడ్డి ముత్యాలరావు, గుబ్బల భవాని, ఇరిగేషన్ జేఈ సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.


# తల్లిపాలే బిడ్డకు ఆహారం కావాలి



**సామర్లకోట, (రాజధాని వార్తలు):** పుట్టిన బిడ్డకు ఆరు నెలల వరకు తల్లిపాలే ఆహారం కావాలని అంగన్వాడి సూపర్వైజర్ ఎండి సుల్తాన్ బీబీ, ఉమాదేవిలు అన్నారు. జిల్లా స్త్రీ మరియు శిశు సంక్షేమ శాఖ ప్రాజెక్టు డైరెక్టర్ సిహెచ్ లక్ష్మి ఆదేశాల మేరకు పెద్దాపురం ప్రాజెక్టు అధికారిని జి ఉష సూచనలతో సూపర్వైజర్ ఎండీ సుల్తాన్ బీబి సామర్లకోట మునిసిపాలిటీ పరిధిలోని కోటపేట అంగ న్వాడీ కేంద్రంలో, ఉమాదేవి ఆధ్వర్యంలో మార్కెట్ వీధిలోని అంగన్వాడీ కేంద్రాల్లో తల్లిపాల వారోత్సవాల కార్యక్రమము మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ శిశువు జన్మించిన గంటలోపే ముర్రుపాలు ఇవ్వా లని, ఇతర ద్రవ పదార్థాలు ఏమీ పట్టరాదని, ఆరు నెలలు పూర్తి అయ్యేవరకు బిడ్డకు కేవలం తల్లిపాలు మాత్రమే పట్టాలని తెలిపారు. ఏఎన్ఎం సత్యవేణి మాట్లాడుతూ తల్లిపాలు ఏ విధముగా ఇవ్వాలో తెలియచేశారు. ఈ కార్యక్రమంలో ఇంకా తల్లి పాల వలన ప్రయోజనాలు, బాలింతలు, తల్లులు తీసుకో వాల్సిన జాగ్రత్తలపై పలువురు వివరించారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడి కార్యకర్తలు ఎస్కె వల్లీజాన్, ఆర్ చిన్నారి, పద్మావతి, రమాదేవి, రాజా రాజేశ్వరి, సత్యవేణి, హెల్పేర్ శాంతి, గర్భవతులు, బాలింతలు, తల్లులు పాల్గొన్నారు.

# అక్రమ బోర్లతో నీటి వ్యాపారమా...?

## - అధికారులను నిలదీసిన వైసీపీ నాయకులు



**సామర్లకోట, (రాజధాని వార్తలు):** సామర్లకోట మున్సిపాలిటీలోని ఉండూరు రోడ్డులో మున్సిపల్ స్థలంలో అనుమతులు లేకుండా బోర్లు వేసి భూగర్భ జలాలను అక్రమంగా వినియోగిస్తూ ట్యాంకర్ల ద్వారా ఏళ్ల తరబడి నీటి వ్యాపారం నిర్వహిస్తున్నారని, దీనికి అడ్డుకట్ట వేయలేరా అంటూ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు అధికారులను ప్రశ్నించారు. మంగళవారం ఈ ప్రాంతాన్ని మాజీ కౌన్సిలర్లు పరిశీలించి, మున్సిపల్ కమిషనర్ కనకారావు దృష్టికి సమస్యను తీసుకెళ్లారు. మాజీ కౌన్సిలర్ నేతల హరిబాబు మాట్లాడుతూ వ్యవసాయ అవసరాల కోసం మాత్రమే వినియోగించాల్సిన బోర్ల నుంచి నీటిని ట్యాంకర్లలో నింపి కంపెనీలకు విక్ర యిస్తూ అక్రమ వ్యాపారం సాగిస్తున్నారని ఆరోపించారు. పలుమార్లు అధికారులకు ఫిర్యాదు చేసిన ప్పటికీ ఎలాంటి చర్యలు తీసుకోలేదని విమర్శించారు. ఈ వ్యవహారంలో రాజకీయ పలుకుబడి ఉన్న వారి అండదండలు ఉన్నాయనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయని అన్నారు.

అక్రమ బోర్లు, నీటి వ్యాపారంపై మున్సిపల్ అధికారులు వెంటనే విచారణ చేపట్టి బాధ్యులపై చర్యలు తీసుకో వాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో పెద్దఎత్తున ఆందోళన చేపడతామని హెచ్చరించారు. సంఘటన ప్రాంతంలో కమిషనర్ కనకారావుకు సమస్యని వారు వివరించారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు పాగా సురేష్ కుమార్, మాజీ మున్సిపల్ కౌన్సిలర్లు మన్యం చంద్రరావు, కరణం రాజ్‌కుమార్, సేపేని సురేష్, పార్టీ నాయకులు ఇరుసుమళ్ల సాయి, చిట్టిమాని శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.


# గిరిజన ప్రాంతాల అభివృద్ధికి ఉప ప్రణాళిక

**సామర్లకోట, (రాజధాని వార్తలు):** గిరిజన ప్రాంత పరిపాలనలో కీలకమైన పెసాచట్టం, గిరిజన ఉప ప్రణాళిక అమలుకు అన్ని శాఖల ఉద్యోగులు సమన్వయంతో పని చేయాలని సామర్లకోట విస్తరణ శిక్షణ కేంద్రం ప్రిన్సిపల్ కెవిన్వి ప్రసాదరావు పిలుపునిచ్చారు. పెసా చట్టం, గిరిజన ఉప ప్రణాళిక, అటవీ హక్కుల చట్టం అమలుపై వివిధ అనుబంధ శాఖల ఉద్యోగులకు సామర్లకోట విస్తరణ శిక్షణా కేంద్రంలో మూడు రోజుల శిక్షణ కార్యక్రమాన్ని మంగళవారం ఆయన ప్రారంభించారు. గిరిజనుల అభ్యున్నతికి ప్రత్యేకించిన చట్టాల అమలుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎంతో ప్రాధాన్యం ఇచ్చి ఆయా శాఖల ఉద్యోగులకు శిక్షణ కార్యక్రమాలు ఏర్పాటు చేస్తున్నాయని చెప్పారు. షెడ్యూల్ ప్రాంతాల్లో సేవలు అందిస్తున్న అందరికీ ఈ శిక్షణ ఎంతో ఉపయోగపడుతుందన్నారు. గిరిజన చట్టాలు, ఉప ప్రణాళికపై విస్తృత అవగాహనతో ఆయా ప్రాంతాల్లో ప్రభుత్వ కార్యక్రమాలు విజయవంతంగా అమలు చేయవచ్చని ప్రిన్సిపల్ సూచించారు.




పార్వతీపురం మన్యం, అల్లూరి సీతారామరాజు, పోలవరం ఏలూరు జిల్లాల నుంచి వివిధ శాఖల ఉద్యోగులు ఈ శిక్షణకు హాజరయ్యారు. శిక్షణ ప్రారంభ కార్యక్రమంలో ఉప ప్రిన్సిపల్ జి రమణ, డిడివో శర్మ, పెసా చట్టం రాష్ట్ర కోఆర్డినేటర్ సంతోష్, ఎంపీడీఓ సుశీల, డిప్యూటీ ఎంపీడీఓలు చక్రపాణి, చిన్నబ్బులు, ఫ్యాకల్టీ సభ్యులు శ్రీనివాస్, సుమాంజలి, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

# జాతీయ ఎముక, కీళ్ల దినోత్సవం సందర్భంగా అవగాహన



**కాకినాడ రూరల్, (రాజధాని వార్తలు):** స్థానిక సన్ రైజ్ ఆసుపత్రిలో జాతీయ ఎముక మరియు కీళ్ల దినోత్సవం సందర్భంగా డా.బొండ సూర్యరావు మరియు డా.అడ్డాల సత్యనారాయణచే ప్రజలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా దంత వైద్యులు డా.అడ్డాల సత్యనారాయణ మాట్లాడుతూ ఈ దినోత్సవాన్ని భారతదేశంలో ఇండియన్ ఆర్థోపెడిక్ అసోసియేషన్ 2012లో ప్రారంభించిందని, ఆగస్టు 4న ఈ దినోత్సవాన్ని జరుపుకుంటారని, "స్ట్రాంగర్ బోన్స్, స్ట్రాంగర్ ఇండియా" అనేది ఈ దినోత్సవానికి సంబంధించిన నినాదం అని, ఆస్టియోపోరోసిస్ (ఎముకలు పెళుసుబారడం), ఆస్టియో ఆర్థరైటిస్, రుమ టాయిడ్ ఆర్థరైటిస్ వంటి సమస్యల గురించి ప్రజలను అప్రమత్తం చేయడం, అలాగే ఆస్టియో పోరోసిస్ మరియు దంత ఆరోగ్యం మధ్య చాలా బలమైన, ప్రత్యక్ష సంబంధం ఉందని, ఆస్టియో పోరోసిస్ అనేది కేవలం కాళ్లు, చేతుల ఎముకలను మాత్రమే కాకుండా, దవడ ఎముకను కూడా ప్రభావితం చేస్తుందని, ఎముకలను క్షీణింపజేసే ధూమపానం, మద్యం అలవాట్లకు దూరంగా ఉండాలని కోరారు. ఎముకల వైద్య నిపుణులు డా.బొండ సూర్యరావు మాట్లాడుతూ ఆరోగ్యకరమైన ఎముకలు, కీళ్ల కోసం క్యాల్షియం, విటమిన్-డి చాలా అవసరమని, పాలు, పెరుగు, పచ్చి ఆకుకూరలు మరియు డ్రై ఫ్రూట్స్ తరచుగా తీసుకోవాలని, ప్రతిరోజూ కనీసం 30 నిమిషాల పాటు నడక, యోగా లేదా ఏరోబిక్స్ చేయడం వల్ల కీళ్లు ఫ్లెక్సిబుల్‌గా ఉంటాయని బరువులు ఎత్తే వ్యాయామాలు ఎముకల సాంద్రతను పెంచుతాయని, ఉదయం పూట ఎండ శరీరానికి తగిలేలా చూసుకోవడం వల్ల సహజంగా విటమిన్-డి అందుతుందని, మోకాళ్లపై అదనపు భారం పడకుండా ఉండాలంటే శరీర బరువును అదుపులో ఉంచుకోవడం చాలా ముఖ్యమని, వయసు పైబడిన వారు (ముఖ్యంగా 40-50 ఏ ళ్ల దాటిన మహిళలు) క్రమం తప్పకుండా వైద్య పరీక్షలు చేయించుకోవాలని, బలమైన ఎముకలే ఆరోగ్యకరమైన జీవితానికి పునాదన్నారు. ఈ కార్యక్రమంలో ప్రజలు, రిబ్కా రాణీ, గాయత్రి, రమ్య, నాగవల్లి పాల్గొన్నారు.

# నగరంలో పారిశుధ్య వాహనాల నిర్వహణ ప్రైవేటు ప్రతిపాదన విరమించుకోవాలి: సిపిఎం డిమాండ్

**కాకినాడ, (రాజధాని వార్తలు):** కాకినాడ నగర పాలక సంస్థ పరిధిలో పారిశుధ్య వాహనాల నిర్వహణ ప్రైవేటు కాంట్రాక్టర్‌కి ఇచ్చే ప్రతిపాదనలు విరమించుకోవాలని సిపిఎం కాకినాడ నగర కమిటీ డిమాండ్ చేసింది. ఈ సందర్భంగా సిపిఎం నగర కన్వీనర్ పలివెల వీరబాబు ఒక ప్రకటన విడుదల చేస్తూ నగరంలో 14 శానిటేషన్ సర్కిల్స్ పరిధిలో 14 కాంటాక్టర్ వాహనాలు చెత్త సేకరణ లో కీలక పాత్ర పోషించేవని తెలిపారు. గడిచిన కొంతకాలంగా కేవలం 4 వాహనాలు మాత్రమే వర్కింగ్ ఉండడం వల్ల నగరంలో పారిశుధ్యం సక్రమంగా జరగడం లేదన్నారు. అదేవిధంగా 14 ట్రాక్టర్స్‌లో కేవలం 5 మాత్రమే సక్రమంగా పనిచేసిన పరిస్థితి ఉందన్నారు. వాహనాల రిపేర్లకు, క్రొత్త వాహనాలు కొనుగోలుకు రాష్ట్ర ప్రభుత్వం సహకరించాలన్నారు. అదేవిధంగా నగరంలో ఉన్న లోక్‌సభ, రాజ్యసభ ఎంపీలు కూడా తమ నిధుల్లో కొంత నగర పాలక సంస్థకు కేటాయించాలని కోరుతున్నామన్నారు. గత టిడిపి హయాంలో కూడా రాష్ట్ర ప్రభుత్వం 279 జిఓ ద్వారా పారిశుధ్య సేవలు ప్రైవేటు పరం చేస్తే రాష్ట్ర వ్యాప్తంగా జరిగిన పోరాటాల వల్ల తదుపరి ప్రభుత్వం ఆ జిఓను రద్దు చేసారని గమనించాలన్నారు. పారిశుధ్య వాహనాల ప్రైవేటీకరణ అంతి మంగా కార్పొరేషన్‌కు మరింత భారం అవుతుంద న్నారు. అంతిమంగా ప్రజలపై భారాలు వేసే పరిస్థితి వస్తుందన్నారు. ఈ నేపథ్యంలో పారిశుధ్య వాహనాల నిర్వహణ నగర పాలక సంస్థ పరిధిలోనే ఉండాలని సిపిఎం డిమాండ్ చేస్తోందని వీరబాబు ఒక ప్రకటనలో తెలిపారు.

# వరుణ్ తేజ్ ఈసారి హిట్ ఖాయం?.. సెన్సార్ టాక్ ఏమంటోంది!



మెగా ప్రిన్స్ వరుణ్ తేజ్, మేర్లపాక గాంధీ కాంబినేషన్‌లో వచ్చిన ఇండో–కొరియన్ హారర్ కామెడీ 'కొరియన్ కనకరాజు' సెన్సార్ పూర్తి చేసుకుని U/A సర్టిఫికెట్ పొందింది. 2 గంటల 36 నిమిషాల నిడివి ఉన్న ఈ సినిమాకు సెన్సార్ బోర్డ్ నుంచి మంచి స్పందన వచ్చింది. అనంతపురం కుర్రాడిగా, కొరియన్ మాఫియా డాన్‌గా వరుణ్ తేజ్ నటన, ఆయనతో కమెడియన్ సత్య కామెడీ టైమింగ్, తమన్ బ్యాక్‌గ్రౌండ్ స్కోర్ సినిమాకు ప్రధాన హైలైట్స్‌గా నిలవనున్నాయి. ఆ వివరాలు చూద్దాం..

**సెన్సార్ పూర్తి.. బ్లాక్‌బస్టర్ వైబ్స్:**

ఆగస్టు 7న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలోకి రాబోతున్న 'కొరియన్ కనకరాజు' మూవీపై టాలీవుడ్‌లో భారీ అంచనాలు నెలకొన్నాయి. ఇప్పటికే సెన్సార్ పనులను విజయవంతంగా పూర్తి చేసుకున్న ఈ చిత్రం, సెన్సార్ సభ్యుల నుంచి ప్రశంసలు అందుకుంది. ఇక బోర్ కొట్టకుండా మొదటి సన్నివేశం నుండి చివరి వరకు ఎంటర్‌టైన్‌మెంట్ అండ్ థ్రిల్ ఇచ్చేలా స్క్రీన్‌ప్లే ఉందట. ఈ సినిమాకి సెన్సార్ నుంచి బ్లాక్‌బస్టర్ టాక్ రావడంతో చిత్రబృందం ఎంతో సంతోషంలో ఉంది.

**వరుణ్ డ్యూయల్ షేడ్స్ అండ్ సత్య కామెడీ:**

ఈ సినిమాలో వరుణ్ తేజ్ రెండు డిఫరెంట్ షేడ్స్‌లో అదరగొట్టినట్లు తెలుస్తోంది. ఇక రాయలసీమ యాసలో మాట్లాడే అనంతపురం కుర్రాడిగా, అలాగే స్టైలిష్ కొరియన్ గ్యాంగ్‌స్టర్‌గా ఆయన నటన మెప్పిస్తుంది. ఇక ఫస్ట్ హాఫ్‌లో వరుణ్ తేజ్, కమెడియన్ సత్య కాంబినేషన్‌లో వచ్చే కామెడీ సీన్లు థియేటర్లలో ప్రేక్షకులను కడుపుబ్బా నవ్విస్తాయని చెబుతున్నారు. సరికొత్త బాడీ లాంగ్వేజ్‌తో వరుణ్ చేసిన ఈ ప్రయోగం ఆయన కెరీర్‌కు మంచి ప్లస్ కానుంది.

**సీమ కారం వర్సెస్ కొరియన్ కిమ్‌చి:**

'సీమ కారం వర్సెస్ కొరియన్ కిమ్‌చి' బ్యాక్‌డ్రాప్‌లో దర్శకుడు మేర్లపాక గాంధీ రాసుకున్న క్రాస్ కల్చరల్ ఎలిమెంట్స్, హారర్ అండ్ కామెడీ ట్విస్టులు సినిమాకు అసలైన బలంగా నిలిచాయి. దర్శకుడి రైటింగ్, స్క్రీన్‌ప్లే ప్రతీ సన్నివేశంలోనూ కనిపిస్తుందని టాక్. ఇక దానికి తోడు తమన్ అందించిన మాస్ బ్యాక్‌గ్రౌండ్ స్కోర్ సీన్లను నెక్స్ట్ లెవెల్‌కి తీసుకెళ్లింది. విజువల్స్, డైలాగ్స్ కూడా సినిమా రేంజ్‌ను మరింత పెంచాయని ఫిల్మ్ నగర్ వర్గాలు అంటున్నాయి. వరుస విజయాల కోసం చూస్తున్న వరుణ్ తేజ్‌కు 'కొరియన్ కనకరాజు' పక్కా హిట్ ఇస్తుందని సెన్సార్ టాక్ స్పష్టం చేస్తోంది.

ఇక 2 గంటల 36 నిమిషాల క్రిస్ప్ రన్‌టైమ్, సత్య కామెడీ, తమన్ ఆర్ఆర్, మేర్లపాక గాంధీ మార్క్ మార్క్ డైరెక్షన్ అన్నీ తోడవ్వడంతో ఈ చిత్రం బాక్సాఫీస్ వద్ద విజయాన్ని అందుకుంటుందని మెగా అభిమానులు, సినీ విశ్లేషకులు ధీమాగా ఉన్నారు.

# శంభాల డైరెక్టర్‌తో సందీప్ కిషన్.. కొత్త మూవీ టైటిల్, ఫస్ట్ లుక్ రిలీజ్!




శంబాల' సినిమాతో హ్యాట్రిక్ హిట్ కొట్టి క్రేజ్ తెచ్చుకున్న డైరెక్టర్ యుగంధర్ ముని ఇప్పుడు యంగ్ హీరో సందీప్ కిషన్‌తో జతకట్టారు. 'సందీప్ 33'గా రాబోతున్న ఈ భారీ సోషియో ఫాంటసీ అడ్వెంచర్ చిత్రానికి 'కరికాల' అనే పవర్ ఫుల్ టైటిల్ ఖరారు చేశారు. ఈ సందర్భంగా సందీప్ కిషన్ ఫస్ట్ లుక్‌తో పాటు రిలీజ్ డేట్లను ప్రకటించారు. మాయా జాలం, రాజులు, యోధుల నేపథ్యంతో వస్తున్న ఈ సినిమా పోస్టర్ ప్రేక్షకుల్లో విపరీతమైన ఆసక్తిని, భారీ అంచనాలను పెంచేసింది.

**సింహంలా కరికాల ఫస్ట్ లుక్:**

ఈ సినిమా నుంచి విడుదల చేసిన సందీప్ కిషన్ ఫస్ట్ లుక్ పోస్టర్ సినీ ప్రియులను ఎంతగానో ఆకట్టుకుంటోంది. పోస్టర్‌లో సందీప్ కిషన్ గుర్రంపై వేటాడుతున్న సింహంలా చాలా రోషంగా, పవర్ ఫుల్‌గా కనిపిస్తున్నారు. షైనింగ్ పిక్చర్స్ బ్యానర్‌పై వస్తున్న ఈ ఫాంటసీ మూవీలో సందీప్ గెటప్ చాలా కొత్తగా ఉంది. విజువల్ ఎఫెక్ట్స్, ప్రొడక్షన్ డిజైన్ పరంగా ఈ సినిమాను 'శంబాల'ని మించేలా ఎంతో భారీ స్థాయిలో ప్లాన్ చేస్తున్నట్లు ఫస్ట్ లుక్ చూస్తేనే అర్థమవుతోంది.

**రెండు భాగాలుగా రెండు రిలీజ్ డేట్లు:**

ఈ భారీ ప్రాజెక్ట్‌ను మేకర్స్ రెండు భాగాలుగా ప్రేక్షకుల ముందుకు తీసుకురాబోతున్నారు. ఇక ఫస్ట్ లుక్ పోస్టర్‌లోనే రెండు భాగాల విడుదల తేదీలను ఒకేసారి ప్రకటించి అందరినీ ఆశ్చర్యపరిచారు. 'కరికాల' చాప్టర్ 1 జూలై 02, 2027న విడుదల కానుండగా, చాప్టర్ 2 అదే సంవత్సరం అక్టోబర్ 28, 2027న గ్రాండ్‌గా రిలీజ్ కానుంది. రెండు భాగాల మధ్య ఎక్కువ గ్యాప్ లేకుండా కొద్ది నెలల వ్యవధిలోనే సినిమాలను తీసుకు రావాలనే సరికొత్త ప్లాన్‌తో చిత్రబృందం ముందుకు వెళ్తోంది.

**పాన్ ఇండియా రేంజ్‌లో హంగామా:**

ఈ సోషియో ఫాంటసీ అడ్వెంచర్ చిత్రాన్ని కేవలం తెలుగులోనే కాకుండా పాన్ ఇండియా లెవెల్లో తెలుగు, తమిళ, హిందీ భాషల్లో విడుదల చేస్తున్నారు. ఇక సినిమా విడుదలకు ముందు ప్రేక్షకులకు సరికొత్త అనుభూతిని పంచేందుకు సందీప్ కిషన్ ప్రత్యేకమైన ప్రమోషన్ కార్యక్రమాలను కూడా ప్లాన్ చేస్తున్నట్లు సమాచారం. మాయా ప్రపంచం, రాజుల కాలంనాటి అడ్వెంచర్ కాన్సెప్ట్ కావడంతో అన్ని భాషల ప్రేక్షకులను ఈ మూవీ ఖచ్చితంగా ఆకట్టుకుంటుందని టీమ్ ధీమాగా ఉంది. సందీప్ కిషన్, యుగంధర్ ముని కాంబినేషన్‌లో వస్తున్న 'కరికాల' టాలీవుడ్‌లో మరో విజువల్ వండర్‌గా నిలిచేలా కనిపిస్తోంది. ఇక పవర్ ఫుల్ టైటిల్, దానికి తగ్గట్టుగా ఉన్న ఫస్ట్ లుక్ పోస్టర్ సినిమాపై క్యూరియాసిటీని రెట్టింపు చేశాయి. విజువల్ ఎఫెక్ట్స్ మరియు కథనంతో అలరించడానికి సిద్ధమవుతున్న ఈ ఫాంటసీ రైడ్ ప్రేక్షకులకు ఎలాంటి అద్భుతమైన థియేటర్ అనుభూతిని ఇస్తుందో చూడాలి.

# మహేష్‌కు వెకేషన్ హాలీడేస్!



సినిమా రంగంలో రాజమౌళి పర్ఫెక్షన్, క్రమశిక్షణకు మారు పేరుగా నిలుస్తారు. జక్కన్న చిత్రాల షూటింగ్ సమయంలో హీరోలు, సాంకేతిక నిపుణులు ఎంతగానో శ్రమిస్తుంటారు. రాజమౌళి ప్రాజెక్టులతో బిజీగా ఉన్నప్పుడు హీరోలకు ఏమాత్రం విశ్రాంతి దొరకదు. సుదీర్ఘ షెడ్యూల్స్, నిరంతర రిహార్సల్స్ మధ్య ఇతర వ్యక్తిగత పనులకు ..వెకేషన్లకు అవకాశం ఇవ్వడం రాజమౌళి శైలిలో అరుదు. అయితే ప్రస్తుతం మహేష్‌తో తెరకెక్కిస్తోన్న 'వారాణాసి' చిత్రానికి సంబంధించి ఈ ట్రెండ్ మారిపోవడం ఆశ్చర్యకరం. మహేష్ కుటుంబంతో కలిసి తరచూ విదేశీ విహార యాత్రలకు వెళ్లడాన్ని ఎంతో ఇష్టపడతారు. వ్యక్తిగత జీవితానికి, కుటుంబానికి అత్యధిక ప్రాధాన్యత ఇస్తారు. రాజమౌళి వంటి కఠినమైన దర్శకుడితో సినిమా చేస్తున్నప్పుడు ఈ వెకేషన్లకు బ్రేక్ పడుతుందని అందరూ భావించారు. కానీ ఆశ్చర్యకరంగా రాజమౌళి స్వయంగా మహేష్‌కు కావాల్సినన్ని సెలవులు ఇస్తున్నారు. మహేష్ వ్యక్తిగత సమయానికి పూర్తి గౌరవం ఇస్తున్నారు. ఇటీవల జర్మనీలోని బ్లాక్ ఫారెస్ట్ ప్రాంతంలో జరిగిన కఠినమైన ట్రెక్కింగ్ శిక్షణ తర్వాత కూడా మహేష్‌కు తగినంత విశ్రాంతి దొరకడం గమనార్హం. అంతకుముందు రెండు...మూడు సార్లు మహేష్ విదేశాలకు వెకేషన్‌కు వెళ్లొచ్చారు. మహేష్‌కు రాజమౌళి ఇలా వెకేషన్ హాలీడేస్ మంజూరు చేయడం వెనుక ఓ సుదీర్ఘమైన వ్యూహం ఉందనేది విశ్లేషకుల మాట. 'వారాణాసి' గ్లోబల్ స్థాయిలో అత్యంత భారీ బడ్జెట్‌తో వినూత్నమైన కథాంశంతో రూపుదిద్దుకుంటున్న ప్రాజెక్ట్. ఈ స్థాయి చిత్రాల షూటింగ్ సమయంలో నటులు మానసికంగా, శారీరకంగా ఎంతో ఉల్లాసంగా ఉండాలి. నిరంతరం ఒకే సెట్‌లో ఉండి ఒత్తిడికి గురికాకుండా మధ్యమధ్యలో బ్రేక్‌లు తీసుకోవడం వల్ల నటుడి సృజనాత్మక శక్తి రెట్టింపు అవుతుందని రాజమౌళి వారణాసి విషయంలో నమ్ముతున్నట్లు కనిపిస్తుంది. ఈ చిత్రంలో ప్రతి సన్నివేశాన్ని అత్యంత సహజంగా, రియాల్టీకి దగ్గరగా తీసుకురావడానికి మహేష్ తీవ్ర శ్రమనందిస్తున్నారు. భారీ యాక్షన్ సీక్వెన్సులు, ప్రత్యేకమైన శారీరక పరివర్తన కోసం ఆయన చాలా కాలంగా కష్ట పడుతున్నారు. ఇలాంటి భారీ కసరత్తులు చేసే సమయంలో మానసిక ప్రశాంతత అంతే అవసరం.

కుటుంబంతో గడిపే సమయం మహేష్ కు సరికొత్త శక్తిని ఇస్తుందని ఆ పాజిటివ్ ఎనర్జీని తన నటనలో చూపిస్తారని రాజమౌళి భావిస్తున్నట్లు కనిపిస్తుంది. రాజమౌళి దర్శకుడిగా కాకుండా, నటుడిని మానసికంగా అర్థం చేసుకునే సహచరుడిగా వ్యవహరిస్తున్నారనడానికి ఈ వెకేషన్స్ నిదర్శనంగా నిలుస్తుంది. హీరోలపై అనవసరమైన భారం మోపకుండా వారి జీవనశైలికి తగినట్లుగా షెడ్యూల్స్‌ను ప్లాన్ చేయడం రాజమౌళి పరిణతికి అద్దం పడుతోంది. ఎవరి శైలిని వారు గౌరవిస్తూ సినిమా అవుట్‌పుట్‌పై మాత్రం రాజీ పడకుండా ప్రాజెక్ట్‌ను ముందుకు తీసుకెళ్తున్నారు. అంతిమంగా వారాణాసి ఇండియన్ సినిమా హిస్టరీలోనే మైలు రాయిగా నిలవాలని అభిమానులు కోరుకుంటున్నారు. దర్శకుడి అంకితభావం, హీరో పడే శ్రమ రెండూ కలిసి తెరపై అద్భుతాలను సృష్టిస్తాయనడంలో సందేహం లేదని బలమైన నమ్మకంతో ఉన్నారు.

# అమీర్ లేటెస్ట్ టార్గెట్.. ఖాన్‌ల త్రయానికి గ్యాంగ్ స్టర్ బెదిరింపులతో టెన్షన్



బాలీవుడ్ అగ్ర నటులైన 'ఖాన్'ల త్రయానికి వరుస బెదిరింపులు తీవ్ర ఆందోళన కలిగిస్తున్నాయి. ఇప్పటికే సూపర్ స్టార్ సల్మాన్ ఖాన్ మరియు ఆయన కుటుంబం గ్యాంగ్‌స్టర్ లారెన్స్ బిష్ణోయ్ ముఠా నుంచి ప్రాణహాని బెదిరింపులను ఎదుర్కొంటున్న సంగతి తెలిసిందే. దశాబ్దాల నాటి కృష్ణజింకల వేట కేసు లారెన్స్ బిష్ణోయ్ రూపంలో ఆయనను నేటికీ వెంటాడుతుండటంతో, ఎల్లప్పుడూ బుల్లెట్ ప్రూఫ్ వాహనాల్లో, భారీ పోలీసు రక్షణ నడుమ నిరంతర టెన్షన్ వాతావరణంలో కాలం గడపాల్సిన పరిస్థితి నెలకొంది. గతంలో షారూఖ్ ఖాన్‌కు కూడా ఇలాంటి బెదిరింపులు ఎదురుకావడంతో బాలీవుడ్ స్టార్స్ తీవ్ర ఆందోళనకు గురవుతున్నారు. తాజాగా బాలీవుడ్ మిస్టర్ పర్ఫెక్ట్ అమీర్ ఖాన్‌కు కూడా లారెన్స్ బిష్ణోయ్ గ్యాంగ్ నుంచి తీవ్ర హెచ్చరికలు రావడంతో ఆయన భద్రతను అధికారులు మరింత కట్టుదిట్టం చేశారు. లారెన్స్ బిష్ణోయ్ గ్యాంగ్‌కు చెందిన ఆర్జూ బిష్ణోయ్, టైసన్ బిష్ణోయ్‌లతో ముడిపడి ఉన్న ఒక సోషల్ మీడియా పోస్ట్ ఇటీవల వైరల్‌గా మారింది. ఈ బెదిరింపుల నేపథ్యంలో అమీర్ ఖాన్ నివాసం వద్ద పోలీసు పహారాను పెంచడమే కాకుండా, ఆయన ఇంటి చుట్టూ భద్రతా వలయాన్ని ఏర్పాటు చేసి నిరంతర నిఘా ఉంచారు. ఈ బెదిరింపులకు ప్రధాన కారణం అమీర్ ఖాన్ ఇటీవల చేసుకున్న మూడో వివాహమేనని ప్రచారం జరుగుతోంది. గతంలో రీనా దత్తా, కిరణ్ రావులతో విడిపోయిన అమీర్ ఖాన్, జులై 2026లో ముంబైలోని తన నివాసంలో బెంగళూరుకు చెందిన గౌరీ స్ప్రెట్‌ను వివాహం చేసుకున్నారు. అయితే, ఈ వివాహాన్ని లక్ష్యంగా చేసుకుని, ఆయన 'లవ్ జిహాద్'ను ప్రోత్సహిస్తున్నారంటూ సదరు గ్యాంగ్ సోషల్ మీడియా పోస్ట్‌లో తీవ్ర ఆరోపణలు చేసింది. సనాతన ధర్మానికి మరియు మన సంస్కృతికి వ్యతిరేకంగా ప్రవర్తిస్తూ లవ్ జిహాద్‌ను ప్రోత్సహిస్తున్న వారికి ఇదే మా చివరి హెచ్చరిక అని, త్వరలోనే మాదైన శైలిలో సమాధానం చెప్తామని సదరు గ్యాంగ్ ఆ పోస్ట్‌లో బెదిరించింది. స్టార్‌డమ్ పేరుతో ఇటువంటి చర్యలకు పాల్పడే వారి ఊపిరి తీస్తామంటూ తీవ్ర పదజాలంతో హెచ్చరికలు జారీ చేసింది. ఈ పరిణామాలపై మహారాష్ట్ర హోంశాఖ సహాయ మంత్రి యోగేష్ రామ్‌దాస్ కదమ్ స్పందిస్తూ.. పోలీసులు ఈ విషయాన్ని సుమోటోగా స్వీకరించి విచారణ జరుపుతున్నారని, నటుడికి ఉన్న సెక్యూరిటీని సమీక్షించి అవసరమైన భద్రతను పెంపొందిస్తామని స్పష్టం చేశారు. ఒకప్పుడు తమ సినిమాలతో వినోదాన్ని అందించే ఖాన్ హీరోలు, ఇప్పుడు తాము మాట్లాడే ప్రతి మాటలోనూ, తీసుకునే ప్రతి నిర్ణయంలోనూ ఎంతో జాగ్రత్తగా ఉండాల్సిన దుస్థితి ఏర్పడింది. ఒకవైపు సల్మాన్ ఖాన్, మరోవైపు అమీర్ ఖాన్‌లకు లారెన్స్ బిష్ణోయ్ ముఠా నుంచి వరుసగా వస్తున్న ఈ బెదిరింపుల పర్వం బాలీవుడ్ చిత్రసీమలోనే కాకుండా దేశవ్యాప్తంగా తీవ్ర కలకలం రేపుతోంది.

# "కరుణ రస సింధువు – 'కరుణశ్రీ'

## - గురజాడ స్వగృహంలో ఘనంగా జంధ్యాల జయంతి వేడుకలు

**విజయనగరం, (రాజధాని వార్తలు):** కరుణ రసాన్ని తన కలం ద్వారా అక్షరాల్లో పండించి, తెలుగు పద్యానికి ప్రాణప్రతిష్ఠ చేసిన మహాకవి జంధ్యాల పాపయ్య శాస్త్రి. ఆయన జయంతి వేడుకలను తెలుగు భాషా పరిరక్షణ సమితి వ్యవస్థాపక అధ్యక్షులు సముద్రాల గురు ప్రసాద్ ఆధ్వర్యంలో, మహాకవి గురజాడ అప్పారావు స్వగృహంలో అత్యంత ఘనంగా నిర్వహించడం తెలుగు సాహితీ లోకానికి గర్వకారణం. ఈ సందర్భంగా "కరుణశ్రీ"గా ప్రసిద్ధి చెందిన జంధ్యాల పాపయ్య శాస్త్రి గొప్పతనాన్ని, ఆయన సాహితీ విలువలను, పద్యాల మాధుర్యాన్ని స్మరించుకోవడం మనందరి బాధ్యత. తెలుగు సాహితీ వనంలో సుగంధాలు వెదజల్లిన ఆణి ముత్యం జంధ్యాల పాపయ్య శాస్త్రి గారు. ఆయన కేవలం కవి మాత్రమే కాదు, మానవతావాది. పండితులకు మాత్రమే పరిమితమైన పద్యాన్ని పామరుల చెంతకు చేర్చిన ఘనత ఆయనకే దక్కుతుంది. ఆయన కలం నుండి జాలువారిన ప్రతి అక్షరం సామాన్యుడి గుండెను తాకింది. 'కరుణశ్రీ' అనే కలం పేరుతో ఆయన చేసిన సాహితీ సేవ అజరామరం. అహంకారం, ఆడంబరం లేని స్వచ్ఛమైన కవిత్వం ఆయన సొంతం. జంధ్యాల పాపయ్య శాస్త్రి పద్యాలు చదువుతుంటే అది ఒక కవిత్వంలా కాకుండా, మన పక్కన కూర్చుని ఒక ఆప్తుడు చెబుతున్న మృదువైన వచనంలా అనిపిస్తుంది. ఆయన పద్యాల్లోని ధారాశుద్ధి అటువంటిది. కరుణశ్రీ పద్యాల గొప్పతనాన్ని చెప్పాలంటే ముందుగా గుర్తుకొచ్చేది "పుష్ప విలాపం". దేవుడి పూజ కోసం పూలను కోస్తున్నప్పుడు, ఆ పూలు పడే ఆవేదనను ఆయన వర్ణించిన తీరు హృదయ విదారకం. 'నేనొక పూలమొక్క కడ నిల్చి...' అంటూ సాగే ఆ పద్యాలు కంటతడి పెట్టించని తెలుగు వాడు లేడు. పూలకు కూడా ప్రాణం ఉంటుందని, వాటిని నిర్దాక్షిణ్యంగా తుంచడం మహాపాపమని అత్యంత సున్నితంగా వివరిస్తారాయన.

పెళ్లికి ముందే తల్లయిన కుంతీదేవి తన పసికందును గంగలో విడిచిపెడుతూ పడే మాతృవేదనను ఆయన అక్షరీకరించిన తీరు సాటిలేనిది. అందులోని పద్యాలు పాడు తుంటే ఆ తల్లి కడుపుకోత మన కళ్ల ముందు కదలాడుతుంది. గురజాడ అప్పారావు గారు "దేశమంటే మట్టి కాదోయ్.. దేశమంటే మనుషులోయ్" అని ఎలా చాటారో, అదే గురజాడ ఇంట్లో ఘనంగా జయంతి జరుపుకున్న జంధ్యాల పాపయ్య శాస్త్రి గారు "మనుషులంటే రాళ్లు కాదోయ్.. కరుణ కలిగిన వారోయ్" అని తన కవిత్వం ద్వారా నిరూపించారు. సముద్రాల గురు ప్రసాద్ వంటి భాషాభిమానులు ఇలాంటి వేడుకలు నిర్వహించడం ద్వారా భావితరాలకు కరుణశ్రీ గారి గొప్పతనాన్ని తెలియజేయడం అభినందనీయం. కరుణశ్రీ భౌతికంగా మన మధ్య లేకపోయినా, ఆయన పద్యాలు, అందులోని కరుణ రసం తెలుగు నేల ఉన్నంత కాలం సజీవంగానే ఉంటాయి. కార్యక్రమంలో గురజాడ వారసులు వెంకటేశ్వర ప్రసాద్, ఇందిరా దంపతులు, సమితి సలహాదారు ముళ్ళపూడి సుభద్ర దేవి, ఉపాధ్యక్షులు కాగుపాటి నారాయణమూర్తి, హంస పురస్కార గ్రహీత డాక్టర్ జక్కు రామకృష్ణ, కంటోన్మెంట్ వాసవి సేవా సంఘం అధ్యక్ష కార్యదర్శులు డిమ్స్ రాజు, బత్తుల కామేష్, వడ్డాది అరవింద్, వెంకటరావు గుప్తా తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా మాస్టర్ ఇ.కె. శత జయంతి వేడుకలు

## - భక్తిశ్రద్ధలతో మాస్టర్ సి.వి.వి. గురుపూజా మహోత్సవం





**విజయనగరం, (రాజధాని వార్తలు):** "భృక్త రహిత తారక రాజ యోగ ప్రదాత", పరమగురువులు మాస్టర్ సి.వి.వి. 159వ జయంతి మరియు మాస్టర్ ఇ.కె. శత జయంతి ఉత్సవాలు విజయనగరంలో అత్యంత వైభవంగా, ఆధ్యాత్మిక శోభతో జరిగాయి. ఉత్తరాది మఠం వేదికగా, జగద్గురు పీఠం – విజయనగరం సోదర బృందం ఆధ్వర్యంలో ఈ గురుపూజా మహోత్సవాన్ని అశేష భక్తి ప్రపత్తులతో కన్నుల పండువగా నిర్వహించారు. పూజ్య గురుదేవులు మాస్టర్ ఇ.కె. స్వయంగా ఆచరించి, మార్గనిర్దేశం చేసిన పవిత్ర గురుపూజా విధానంలో ఈ మహోత్సవం జరగడం విశేషం. తారక రాజయోగం ద్వారా మాస్టర్ సి.వి.వి. మానవాళికి అందించిన దివ్యశక్తిని, యోగ మార్గాన్ని స్మరిస్తూ భక్తులు గురుదేవులకు భక్తి నీరాజనాలు అర్పించారు. ప్రాంగణమంతా గురునామ స్మరణతో, వేద మంత్రోచ్చారణలతో, ఆధ్యాత్మిక ప్రకంపనలతో మార్మోగింది. ఈ పవిత్ర కార్యక్రమం యు.వి.ఏ.యన్.రాజు ఆధ్వర్యంలో అత్యంత శ్రద్ధాభక్తులతో కొనసాగింది. ఈ మహోత్సవానికి జగద్గురు పీఠం జాతీయ గౌరవ కార్యదర్శి బి.ఆర్.కె. రాజు ముఖ్య అతిథిగా విచ్చేసి భక్తులనుద్దేశించి ప్రసంగించారు. సద్గురువుల మార్గదర్శకత్వం, తారక రాజయోగం యొక్క ఆవశ్యకత మరియు ఆధ్యాత్మిక సాధనలో భక్తులు అనుసరించాల్సిన మార్గాలను వారు సోదాహరణంగా వివరించారు. ఈ ఉత్సవాలలో జగద్గురు పీఠం సోదర బృందం సభ్యులు, విశేష సంఖ్యలో భక్తులు, ముముక్షువులు పాల్గొని గురుదేవుల అనుగ్రహానికి పాత్రులయ్యారు. ఈ దివ్య కార్యక్రమంతో విజయనగరం నగర పరిసరాలు ఒక నూతన ఆధ్యాత్మిక తేజస్సును సంతరించుకున్నాయి.

# సమష్టి కృషితోనే విమానాశ్రయ ప్రారంభోత్సవం విజయవంతం

## - మూడు రోజుల్లో పాస్ పుస్తకాల పంపిణీ పూర్తి కావాలి : జాయింట్ కలెక్టర్ ఎస్.సేధు మాధవన్





**విజయనగరం, (రాజధాని వార్తలు):** అందరి సమష్టి కృషి ఫలితంగానే అల్లూరి సీతారామరాజు అంతర్జాతీయ విమానాశ్రయ ప్రారంభోత్సవాన్ని ఘనంగా నిర్వహించగలిగామని జాయింట్ కలెక్టర్ ఎస్. సేధు మాధవన్ స్పష్టం చేశారు. ఇందులో భాగస్వాములైన అధికారులను, సిబ్బందిని మంగళవారం కలెక్టరేట్ నుంచి నిర్వహించిన రెవెన్యూ అధికారుల సమావేశంలో ఆయన అభినందించారు. ఈ సమావేశంలో రీ-సర్వే, పట్టాదారు పాసుపుస్తకాల పంపిణీ, 22-ఏ పై విడుదల చేసిన జీవో 444, రెవెన్యూ వన్, పీజీఆర్ఎస్ వినతులపై సమీక్ష నిర్వహించారు. ఆగస్టు నెలకు సంబంధించిన పట్టదారు పాసుపుస్తకాల పంపిణీని మూడు రోజుల్లోగా పూర్తి చేయాలని ఆయన ఆదేశించారు. సెప్టెంబర్ నెలాఖరు నాటికి మొత్తం 50 గ్రామాల రీ-సర్వే పూర్తి చేయాల్సి ఉందని, ఈ లక్ష్యాన్ని ఎట్టి పరిస్థితుల్లోనూ సాధించి తీరాలని స్పష్టం చేశారు. జీవో 444కు సంబంధించి సమీక్షిస్తూ.. వీఆర్వో, ఎంపీడీవో లాగిన్‌లలో ఉన్న 22-ఏ దరఖాస్తులన్నింటినీ ఈ నెలలోనే పరిష్కరించాలని ఆదేశించారు. నిర్దేశించిన నాలుగు విభాగాల్లోని దరఖాస్తులను ఎక్కడా పెండింగ్ ఉంచకుండా క్లియర్ చేయాలని సూచించారు. రెవెన్యూ వన్‌కు సంబంధించి స్కానింగ్ ప్రక్రియలో మన జిల్లా రాష్ట్రంలో 5వ స్థానంలో ఉందని, మిగిలిన స్కానింగ్ కూడా పూర్తి చేసి మరింత మెరుగైన ర్యాంక్ సాధించడానికి కృషి చేయాలని కోరారు. ఫేజ్-4 రీ-సర్వే ప్రక్రియపై సమీక్షిస్తూ, ఇది ప్రస్తుతం తహశీల్దార్ల లాగిన్‌లలో పెండింగ్‌లో ఉందని తెలిపారు. అలాగే ఫేజ్-3కి సంబంధించి పీపీబీ పంపిణీ పెండింగ్‌లో ఉందని, దాన్ని వెంటనే పూర్తి చేయాలని ఆదేశించారు. పీజిఆర్ఎస్ కి సంబంధించి దరఖాస్తులను పూర్తిగా పరిష్కరించి, ప్రజల సంతృప్తి స్థాయిని పెంచాలని సూచించారు. రెవెన్యూ క్లినిక్స్‌కి సంబంధించి తిరస్కరణకు గురి అయిన దరఖాస్తులపై ఆయన ఆరా తీశారు. ఈ సమీక్షా సమావేశంలో డీఆర్వో సీహెచ్. సత్తిబాబు, సర్వే ఏడీ విజయ్ కుమార్, అలాగే ఆన్‌లైన్ ద్వారా ఆర్డీవోలు, తహశీల్దార్లు పాల్గొన్నారు.

# వైకాపా శ్రేణులకు దిశా నిర్దేశం చేసిన యువ నేత బొత్స సాయి గురు నాయుడు







**గజపతినగరం, (రాజధాని వార్తలు):** నియోజకవర్గ కేంద్రమైన గజపతినగరంలోని ప్రైవేట్ ఫంక్షన్ హాల్‌లో ఏ.పీ జన్ - జి వార్, టౌన్ హాల్ సమావేశాలు మాజీ ఎమ్మెల్యే బొత్స అప్పల నరసయ్య, యువనేత బొత్స సాయి గురునాయుడు ఆధ్వర్యంలో మంగళవారం జరిగాయి. డీఎస్సీ 2025లో ఎన్నో అవకతవకలు జరిగాయని అర్హతలు ఉండి ఎంతో మంది నిరుద్యోగ యువత అన్యాయ మైపోయారని యువ నేత బొత్స సాయి గురు నాయుడు అన్నారు. తప్పనిసరిగా ఇటువంటి అక్రమాలపై పార్టీ ఏకతాటిపైకి వచ్చి పోరాటం చేయవలసిన అవసరం ఎంతైనా ఉందని యువ నేత బొత్స సాయి గురు నాయుడు పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. మనం ఇటువంటి అక్రమాలపై పోరాడకపోతే కూటమి ప్రభుత్వం ఎన్ని స్కాములైన చేస్తారని బొత్స అన్నారు. ముందుగానే మనం ప్రశ్నిస్తే భవిష్యత్తులో మళ్లీ ఇటువంటి తప్పులు జరగకుండా ఉంటాయని బొత్స సాయి గురు నాయుడు అన్నారు. తప్పులు ఎవరు చేసినా ప్రశ్నిస్తే అటువంటి తప్పులను చేయడానికి భయపడతారని సాయి గురు నాయుడు అన్నారు. భవిష్యత్తులో పార్టీని మరింత బలోపేతం చేయడానికి నియోజకవర్గంలో మండలాల వారీగా నాయకులను నేను కలుస్తానని, మీతో సమావేశాలు నిర్వహిస్తానని బొత్స సాయి గురు నాయుడు పార్టీ శ్రేణులకు భరోసాతో పిలుపునిచ్చారు. నియోజకవర్గంలో పార్టీ పూర్వవైభవాన్ని పొందడం కోసం రాబోయే స్థానిక ఎన్నికలలో గాని, సార్వత్రిక ఎన్నికలలో గాని మనమందరం కలిసి పని చేయవలసిన అవసరం ఎంతైనా ఉందని బొత్స సాయి గురు నాయుడు పార్టీ శ్రేణులు ఉద్దేశించి ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో మండల నాయకులు మండల సురేష్, జడ్పిటిసి గార తవుడు, మండల పార్టీ అధ్యక్షుడు పల్లి సంజీవరావు, దత్తిరాజేరు మాజీ ఎంపీపీ కంది తిరుపతి నాయుడు, బూడి వెంకటరావు, వివిధ మండలాల ఎంపీపీలు, జడ్పిటిసిలు, యువజన విభాగం అధ్యక్షులు, వివిధ హోదాల్లో గల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# ప్రాథమిక దశలోనే ఆరోగ్య సమస్యలను గుర్తించాలి

## - జిల్లా ఆర్.బి.ఎస్.కె పిఓ డా.జగన్ మోహన్



**మక్కువ, (రాజధాని వార్తలు):** క్షేత్రస్థాయిలో ఆరోగ్య పరమైన సమస్యలను సత్వరమే గుర్తించి తగు చికిత్స అందించాలని జిల్లా ఆర్.బి.ఎస్.కె అధికారి డాక్టర్ టి.జగన్ మోహనరావు సూచించారు. శంబర, మక్కువ, డోకిశీల ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో నిర్వహించిన ఆశా డే కార్యక్రమంలో మంగళవారం ఆయన పాల్గొన్నారు. క్షేత్ర స్థాయిలో వైద్య సేవలు, ఆరోగ్య కార్యక్రమాల నిర్వహణపై సమీక్ష జరిపారు. అసంక్రమిత వ్యాదుల గుర్తింపుకు చేపడుతున్న ఎన్.సి.డి సర్వే నెలాఖరుకు పూర్తిచేయాలని ఆదేశించారు. 4డి లక్షణాలు గుర్తింపే లక్ష్యంగా అంగన్వాడీ కేంద్రాలు, స్కూల్స్‌లో ఆర్.బి.ఎస్.కె 2.0 స్క్రీనింగ్ పారదర్శకంగా చేపట్టాలన్నారు. క్షేత్ర స్థాయిలో అనారోగ్య లక్షణాలు గుర్తించడంలో జాప్యం ఉండరాదన్నారు. వసతి గృహాలను తరచుగా సందర్శించి విద్యార్థుల సమాచారం తెలుసుకోవాలన్నారు. మలేరియా నిర్ధారణ పరీక్షలు, మందులు గ్రామాల్లో అందుబాటులో ఉండాలన్నారు. హెల్త్ సర్వే, ఆరోగ్య సూచికలలో వెనుకంజలో ఉన్న సిబ్బందికి కారణాలపై వివరణ అడిగి నిర్దేశిత గడువులో పూర్తి చేయాలని ఆదేశించారు. సంచార చికిత్సా శిబిరాలు, ప్రత్యేక వైద్య శిబిరాలు, గృహ సర్వేలో ప్రజారోగ్యమే ధ్యేయంగా వైద్య సేవలు అందించాలన్నారు. అనంతరం శంబర జెడ్పీ ఉన్నత పాఠశాలను సందర్శించి విద్యార్థుల హెల్త్ స్క్రీనింగ్‌పై సమీక్షించారు. ఈ కార్యక్రమంలో డా.ఎల్.శివాజీనాయుడు, డా. ఆర్.చంద్రశేఖర్, డా. బి.ఫణీంద్ర, సిహెచ్ఓ సరోజిని, ఆరోగ్య పర్యవేక్షకులు, వైద్య సిబ్బంది ఆశా కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# తల్లి పాలే బిడ్డకు మొదటి టీకా

## - ఐసిడిఎస్ పర్యవేక్షకురాలు టీ.జానకి





**గజపతినగరం, (రాజధాని వార్తలు):** మండలంలోని లోగిస గ్రామంలో తల్లిపాల వారోత్సవాలు ఘనంగా జరిగాయి. తల్లి పాలవలన బిడ్డలకు రోగనిరోధక శక్తి పెరుగుతుందని, తల్లిపాలే బిడ్డకు మొదటి తేడా అని ఐసిడిఎస్ ప్రాజెక్ట్ పర్యవేక్షకురాలు టి.జానకి అన్నారు. మంగళవారం మండలంలోని లోగిస గ్రామం లో తల్లి పాల వారోత్సవాలు ఘనంగా నిర్వహించారు. గజ పతినగరం ఐసిడిఎస్ ప్రాజెక్ట్ ఎస్ లింగాలవలస సెక్టార్ లోగిస క్లస్టర్ పరిధిలో తల్లి పాల విశిష్టతను వివరిస్తూ అవగాహన ర్యాలీ చేపట్టారు.

ఈ సందర్భంగా జానకి మాట్లాడుతూ "తల్లి పాలతో బిడ్డకు మేధస్సు, ఎదుగుదల కలుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ కార్యకర్తలు సుభాషిణి, జయలక్ష్మి, చంద్రావతి, సుజాత, జయ, జానకి, గర్భిణీలు, బాలింతలు, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

# డిఎస్సీ అక్రమాలపై సీబీఐ విచారణ జరపాలి - నెల్లూరు రూరల్ నియోజకవర్గ సమన్వయకర్త ఆనం విజయకుమార్ రెడ్డి

**- నెల్లూరు రూరల్ నియోజకవర్గంలో వైఎస్ఆర్‌సిపి నియోజకవర్గ స్థాయి టౌన్ హాల్ మీటింగ్ - విద్యాశాఖ మంత్రి లోకేష్ తక్షణమే రాజీనామా చేయాలి - ఫీజు రీయింబర్స్మెంట్, రూ. 3000 నిరుద్యోగ భృతిని వెంటనే విడుదల చేయాలని డిమాండ్**











**నెల్లూరు, (రాజధాని వార్తలు):** రాష్ట్రంలో నిరుద్యోగులు, విద్యార్థుల సమస్యలపై వై.యస్.ఆర్ కాంగ్రెస్ పార్టీ నెల్లూరు రూరల్ నియోజకవర్గ సమన్వయకర్త ఆనం విజయకుమార్ రెడ్డి ఆదేశాల మేరకు నెల్లూరు రూరల్ నియోజకవర్గ కార్యాలయం నందు నియోజకవర్గ స్థాయి టౌన్ హాల్ సమావేశం కార్యాలయంలో నెల్లూరు రూరల్ నియోజకవర్గ నాయకులు మరియు కార్యకర్తలు ఆధ్వర్యంలో నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా నెల్లూరు రూరల్ నియోజకవర్గ పరిశీలకులు చిలుకూరు సుధీర్ రెడ్డి పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కమిటీ సభ్యులు, జిల్లా కమిటీ సభ్యులు, జిల్లా అనుబంధ సంఘాల అధ్యక్షులు, నెల్లూరు రూరల్ నియోజకవర్గ అనుబంధ సంఘాల అధ్యక్షులు, క్లస్టర్ ఇన్చార్జులు, డివిజన్ ఇన్చార్జులు, నెల్లూరు రూరల్ నియోజకవర్గ నాయకులు మరియు కార్యకర్తలు పాల్గొన్నారు. నిరుద్యోగ భృతి హామీ ఏమైంది 2024 ఎన్నికలకు ముందు చంద్రబాబు ఇచ్చిన 'సూపర్ సిక్స్', 'సూపర్ సెవెన్' హామీలలో యువతకు అత్యంత కీలకమైన 'నిరుద్యోగ భృతి' హామీ కూడా ఉందని, అధికారంలోకి వచ్చాక దాని అమలును పక్కనబెట్టారని విమర్శించారు. నిరుద్యోగ భృతి హామీ విస్మరణ, ఒక్క పైసా కూడా చెల్లించలేదని తీవ్ర విమర్శలు: రాష్ట్రంలోని నిరుద్యోగ యువతకు నెలకు రూ.3 వేల చొప్పున నిరుద్యోగ భృతి అందిస్తామని ప్రకటించిన ప్రభుత్వం, అధికారంలోకి వచ్చాక ఆ హామీని పూర్తిగా విస్మరించింది. నిరుద్యోగికి రావాల్సింది రూ.1.08 లక్షలు: నిరుద్యోగ యువతకు నెలకు రూ. 3 వేల చొప్పున ఆర్థిక సహాయం అందిస్తామని ఎన్నికల వేళ చంద్రబాబు ప్రకటించారు.?ఏడాదికి రూ. 36 వేలు లెక్కన ప్రతి నిరుద్యోగికి ఏడాదికి రూ. 36 వేల చొప్పున అందాల్సి ఉంది. మూడేళ్ల కాలానికి గాను ఒక్కో నిరుద్యోగ యువకుడికి మొత్తం రూ. 1,08,000 చెల్లించాల్సి ఉంటుంది. ఇంత పెద్దమొత్తంలో లబ్ధి చేకూరాల్సి న నిరుద్యోగ భృతి పథకం కింద మూడేళ్ల కాలంలో కూటమి ప్రభుత్వం యువతకు ఒక్క పైసా కూడా చెల్లించకపోవడం దారుణమని పేర్కొన్నారు. ఇది నిరుద్యోగులను స్పష్టంగా వంచించడమేనని పూజిత విమర్శించారు.

# జిల్లాలోని సంక్షేమ హాస్టళ్లకు మహర్దశ

**- విద్య, వసతి, వికాసం కార్యక్రమానికి శ్రీకారం - జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్ల ప్రత్యేక చొరవతో సంక్షేమ హాస్టళ్ల సమగ్ర ఆధునీకరణ**



**నెల్లూరు, (రాజధాని వార్తలు):** విద్యార్థులకు ఇంటికి దూరంగా ఉన్నా ఇంటి వాతావరణాన్ని కల్పించాలనే లక్ష్యంతో, జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్ల ప్రత్యేక చొరవతో "విద్య వసతి వికాసం" అనే వినూత్న కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. జిల్లాలోని ఎస్సీ, ఎస్టీ, బీసీ, గిరిజన, మైనారిటీ సంక్షేమ హాస్టళ్లలో మౌలిక వసతులను సమగ్రంగా అభివృద్ధి చేసి, విద్యార్థులకు సురక్షితమైన, పరిశుభ్రమైన, ఆధునిక వసతి కల్పించేందుకు ఈ కార్యక్రమాన్ని రూపొందించారు. దీంతో జిల్లాలోని సంక్షేమ హాస్టళ్ల రూపురేఖలు పూర్తిగా మారనున్నాయి. మంగళవారం ఉదయం తిక్కన ప్రాంగణంలో ఈ కార్యక్రమాన్ని కలెక్టర్ హిమాన్షు శుక్లా లాంఛనంగా ప్రారంభించారు. జిల్లాలోని 155 సంక్షేమ హాస్టళ్లలో చదువుతున్న 19,069 మంది విద్యార్థులకు ప్రయోజనం చేకూరేలా రూ.34.80 కోట్ల అంచనా వ్యయంతో ఈ ప్రాజెక్టును రూపొందించారు. ఇందులో రూ.20.35 కోట్లు (58 శాతం) మౌలిక వసతుల మరమ్మతులకు, రూ.14.45 కోట్లు (42 శాతం) ఫర్నిచర్, పరికరాలు, ఆధునిక సౌకర్యాల ఏర్పాటుకు కేటాయించారు. ప్రాజెక్టులో భాగంగా పాత భవనాల మరమ్మతులు, పైకప్పుల పునరుద్ధరణ, ఫ్లోరింగ్, పెయింటింగ్, తలుపులు, కిటికీలు, ప్రహరీ గోడలు, మరుగుదొడ్ల అభివృద్ధి, తాగునీటి సౌకర్యాలు, బోర్‌వెల్లు, సింటెక్స్ ట్యాంకులు, ఆర్‌వో ప్లాంట్లు, వర్షపు నీటి సంరక్షణ, విద్యుత్ వైరింగ్ ఆధునీకరణ, సీలింగ్ ఫ్యాన్లు, లైటింగ్, సోలార్ లైట్లు తదితర పనులు చేపట్టనున్నారు. అదే విధంగా హాస్టళ్లలో విద్యార్థుల నిత్యావసరాలకు అవసరమైన అన్ని సౌకర్యాలు కల్పించనున్నారు. సానిటరీ న్యాప్‌కిన్ ఇన్సినిరేటర్లు, సోలార్ గీజర్లు, వాషింగ్ మెషీన్లు, కంప్యూటర్లు, స్మార్ట్ టీవీలు, స్మార్ట్ ఫోన్లు, ఇన్వర్టర్లు, స్టీల్, అల్యూమినియం వంట పాత్రలు, నిల్వ ర్యాకులు, గ్రైండర్లు, మిక్సీలు, గ్యాస్ స్టౌలు, కుక్కర్లు, కుర్చీలు, టేబుళ్లు, ఎయిర్‌టైట్ కంటైనర్లు, డస్ట్‌బిన్లు, అద్దాలు, మగ్గులు, లైబ్రరీ పుస్తకాలు, బెడ్‌షీట్లు, ట్రంక్ బాక్సులు, క్రీడా సామగ్రి వంటి ఆధునిక సౌకర్యాలను అందుబాటులోకి తీసుకురానున్నారు. జిల్లాలోని సామాజిక సంక్షేమ, బీసీ సంక్షేమ, గిరిజన సంక్షేమ, ఏపీఎస్‌డబ్ల్యూఆర్‌ఈఐ గురుకులాలు, మైనారిటీ సంక్షేమ శాఖల పరిధిలోని హాస్టళ్లన్నీ ఈ ప్రాజెక్టు పరిధిలోకి వస్తాయి. విద్యార్థుల సంఖ్య, హాస్టళ్ల అవసరాలను పరిగణనలోకి తీసుకుని నిధుల కేటాయింపు చేపట్టారు. ప్రాజెక్టును ఐదు దశల్లో అమలు చేయనున్నారు. ముందుగా పరిపాలనా అనుమతులు, నిధుల మంజూరు, సంస్థల వారీగా పనుల కేటాయింపు, అనంతరం భవనాల మరమ్మతులు, నీటి సరఫరా, పారిశుద్ధ్యం, విద్యుత్ పనులు, పరికరాల కొనుగోలు, పంపిణీ, చివరగా నాణ్యత తనిఖీలు నిర్వహించి పూర్తి స్థాయిలో అమలు చేస్తారు. జిల్లా కలెక్టర్ ప్రత్యక్ష పర్యవేక్షణలో ఈ కార్యక్రమం కొనసాగుతుంది. జిల్లా బీసీ సంక్షేమ మరియు సాధికారత అధికారి నోడల్ అధికారిగా వ్యవహరించగా, ఏపీఈడబ్ల్యూఐడీసీ ఇంజినీరింగ్ విభాగం నిర్మాణ పనుల అమలు, నాణ్యత పర్యవేక్షణ చేపడుతుంది. ప్రతి హాస్టల్‌లో భౌతిక, ఆర్థిక పురోగతిని నిరంతరం సమీక్షిస్తూ, అవసరమైతే థర్డ్ పార్టీ తనిఖీలు కూడా నిర్వహించనున్నారు. "ప్రతి విద్యార్థికి సురక్షితమైన, గౌరవప్రదమైన, నాణ్యమైన వసతి కల్పించడమే విద్య వసతి వికాసం కార్యక్రమం లక్ష్యం. మౌలిక వసతుల కొరత వల్ల ఏ విద్యార్థి వెనుకబడకూడదన్న సంకల్పంతో ఈ కార్యక్రమాన్ని చేపడుతున్నాం" అని జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్ల పేర్కొన్నారు.

# డిసిసిబి చైర్మన్‌కు బ్రాహ్మణ సంఘం వినతి

**సామర్లకోట, (రాజధాని వార్తలు):** సామర్లకోటలోని పంచారామ క్షేత్రమైన శ్రీ కుమారరామ భీమేశ్వరస్వామి దేవస్థానం వద్ద శాశ్వత పిండప్రదాన మండపాన్ని నిర్మించాలని కోరుతూ శ్రీ కుమారరామ భీమేశ్వరస్వామి బ్రాహ్మణ సేవా సంఘం ప్రతినిధులు కాకినాడ జిల్లా జనసేన పార్టీ అధ్యక్షులు, డీసీసీబీ చైర్మన్ తుమ్మల రామస్వామి (బాబు)కు మంగళవారం వినతిపత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో బ్రాహ్మణ సేవా సంఘం సభ్యులు, పురోహితులు, అర్చకులు పాల్గొని వారి సమస్యలను ఆయన దృష్టికి తీసుకు వచ్చారు. ఈ సందర్భంగా సంఘం ప్రతినిధులు మాట్లాడుతూ సామర్లకోటలోని శ్రీ కుమారరామ భీమేశ్వరస్వామి ఆలయం దేశవ్యాప్తంగా ప్రసిద్ధి చెందిన పంచారామ క్షేత్రాల్లో ఒకటని తెలిపారు. ప్రతి సంవత్సరం భక్తులు పెద్ద సంఖ్యలో పిండప్రదానాలు నిర్వహించేందుకు ఆలయానికి వస్తుంటారని, ముఖ్యంగా 2027 జూన్‌లో జరగనున్న గోదావరి పుష్కరాల సందర్భంగా లక్షలాది మంది భక్తులు విచ్చేసే అవకాశం ఉన్నందున ముందస్తుగా శాశ్వత పిండ ప్రదాన మండపాన్ని నిర్మించాలని కోరారు. గోదావరి కాలువలో ప్రవహించే పవిత్ర జలాలతో, భీమేశ్వర స్వామి వారి కోనేరు సమీపంలో శాశ్వత పిండప్ర దాన మండపం ఏర్పాటు చేస్తే భక్తులు ఎలాంటి ఇబ్బందులు లేకుండా పితృకార్యాలు నిర్వహించుకునే అవకాశం ఉంటుందని వారు వివరించారు. ఈ నిర్మాణం వల్ల భవిష్యత్తులో పుష్కరాలు సహా అన్ని పర్వదినాల్లో భక్తులకు ఎంతో సౌకర్యం కలుగుతుందని పేర్కొన్నారు. వినతిని స్వీకరించిన డీసీసీబీ చైర్మన్ తుమ్మల రామస్వామి స్పందిస్తూ సంబంధిత అధికారులతో చర్చించి ఈ సమస్యకు



త్వరితగతిన పరిష్కారం చూపేలా చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు. భక్తుల అవసరాలను దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వ స్థాయిలో అవసరమైన చర్యలు చేపట్టేందుకు తన వంతు కృషి చేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో కుమార రామ భీమేశ్వర బ్రాహ్మణ సేవా సంఘ అధ్యక్షులు ఓలేటి పార్వతీశం, ఉపాధ్యక్షులు బుజ్జి, సహాయ కార్యదర్శి బోనాల సురేష్, చీమల కొండ గోపాలం, అప్పల శివ వెంకట ఫణీంద్ర, మార్కెట్ కమిటీ డైరెక్టర్ గాధంశెట్టి శ్రీనివాస్, పెద్దాపురం పట్టణ జనసేన పార్టీ అధ్యక్షులు పోలమరశెట్టి సత్తిబాబు, మాజీ కౌన్సిలర్ ఓబిలి శెట్టి గున్ని, గౌరవ అధ్యక్షులు కఠారి శ్రీను, యువత అధ్యక్షుడు తమనర లక్ష్మణ్ దివాకర్, త్రిపురగిరి చంద్రముఖి, బెందులూరి స్వామి, అల్లం కుమార్, ధరణికోట యోహాన్, వృద్ధి సురేంద్ర, ఖండవల్లి సత్యనారాయణ, చిన్ని రాజా, సకురు కనకరవు, శ్రీనివాస్ శర్మ తదితరులు పాల్గొన్నారు.

# డీఎస్సీ – 2025 లో అవకతవకలపై లోకేష్ రాజీనామా చేయాలి

**- డీఎస్సీ స్కాంపై సి.బి.ఐ చేత సమగ్ర విచారణ జరిపించాలి**

**- మాజీ ఎమ్మెల్యే బొత్స అప్పలనరసయ్య నరసయ్య డిమాండ్**







**గజపతినగరం, (రాజధాని వార్తలు):** నియోజకవర్గ కేంద్రమైన గజపతినగరంలోని ప్రైవేట్ ఫంక్షన్ హాల్‌లో ఏ.పీ జన్ – జి వార్, టౌన్ హాల్ సమావేశాలు మాజీ ఎమ్మెల్యే బొత్స అప్పలనరసయ్య, యువనేత బొత్స సాయి గురునాయుడు ఆధ్వర్యంలో మంగళవారం జరిగాయి. ఈ సమావేశంలో ముందుగా బొత్స అప్పలనరసయ్య మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం హయాంలో డీఎస్సీ 2025 జరిగిన విధానాన్ని ఎండగట్టారు. డీఎస్సీ 2025లో జరిగిన అవకతవకలకు విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ నైతిక బాధ్యత వహించి రాజీనామా చేయాలని ఆయన డిమాండ్ చేశారు. డీఎస్సీ 2025లో సుమారు 400 పోస్టులు అక్రమంగా భర్తీ చేశారని బొత్స ఆరోపించారు. ముఖ్యంగా క్రీడా విభాగానికి చెందిన పోస్టులలో భారీగా అవకతవకలు జరిగాయని బొత్స అన్నారు. నకిలీ స్పోర్ట్స్ సర్టిఫికెట్లు, కనీస అర్హతలు లేకుండా స్పోర్ట్స్ కోటాలో నియామకాలు జరిగాయని ఆయన అన్నారు. అదేవిధంగా జాతీయస్థాయిలో క్రీడా విభాగంలో పతకాలు సాధించిన వారికి ఉద్యోగాలు ఇవ్వకుండా జిల్లా స్థాయిలో పాల్గొన్న వారికి ఉద్యోగాలు ఇవ్వడం విడ్డూరంగా ఉందని బొత్స ఎద్దేవా చేశారు. డీఎస్సీ 2025లో టిడిపి కార్యకర్తలకు ఉద్యోగాలు ఇచ్చారని బొత్స అన్నారు. డీఎస్సీ 2025లో అన్ని అర్హతలు ఉండి ఉపాధ్యాయ ఉద్యోగాలు పొందక నిరుద్యోగ యువత అన్యాయానికి గురయ్యారని, అందుచేత డీఎస్సీ 2025 నియామకాలపై సి.బి.ఐ తో సమగ్ర విచారణ జరిపించి అందుకు కారణమైన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని బొత్స డిమాండ్ చేశారు.

**రిలే నిరాహార దీక్షలు విజయవంతం చేయాలి:**

**యువతకు, నిరుద్యోగులకు, పార్టీ శ్రేణులకు బొత్స పిలుపు:**

2025 డీఎస్సీలో జరిగిన లీకేజీలు, అక్రమాలపై నిరసనగా ఆగస్టు 6వ తేదీన దత్తిరాజేరు జామి మండలాలు, 7వ తేదీన బొండపల్లి, 8వ తేదీన గంట్యాడ, 9వ తేదీన గజపతినగరం మండలాల్లో రిలే నిరాహార దీక్షలు నిర్వహించడం జరుగుతుందని



బొత్స అన్నారు. నియోజకవర్గంలో గల అన్ని మండలాల నుంచి యువత, నిరుద్యోగులు పార్టీ నాయకులు పెద్ద ఎత్తున పాల్గొని ఈ నిరసన ఉద్యమాన్ని విజయవంతం చేయాలని మాజీ ఎమ్మెల్యే బొత్స పిలుపునిచ్చారు.

**వైయస్సార్‌సీపీ హయాంలో ప్రభుత్వ నియామకాలు పారదర్శకంగా జరిగాయి:**

వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉన్న సమయంలో సుమారు 1.35 లక్షల గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగాలను పూర్తిగా పారదర్శకంగా భర్తీ చేశామని, పార్టీ కార్యకర్తలకు కాకుండా అర్హత సాధించిన నిరుద్యోగ యువతకే ఉద్యోగాలు కల్పించామని బొత్స అప్పలనరసయ్య పేర్కొన్నారు. సచివాలయ నియామకాలలో ఎక్కడ అవకతవకలు లేకుండా పోస్టులు భర్తీ చేసిన ఘనత మాజీ ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డికే దక్కుతుందని బొత్స అన్నారు. ఈ కార్యక్రమంలో మండల నాయకులు మండల సురేష్, జడ్పిటిసి గార తవుడు, మండల పార్టీ అధ్యక్షుడు పల్లి సంజీవరావు, దత్తిరాజేరు మాజీ ఎంపీపీ కంది తిరుపతి నాయుడు, బూడి వెంకటరావు, వివిధ మండలాల ఎంపీపీలు, జడ్పిటిసిలు, యువజన విభాగం అధ్యక్షులు, వివిధ హోదాల్లో గల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# అగ్ని ప్రమాద కుటుంబానికి తెదేపా సహాయం

**సామర్లకోట, (రాజధాని వార్తలు):** సామర్లకోట అమ్మణమ్మ అపార్ట్మెంట్లో విద్యుత్ షార్ట్ సర్క్యూట్ వల్ల జరిగిన అగ్నిప్రమాదంలో బాధిత కుటుంబానికి ప్రభుత్వం అండగా ఉంటుందని గౌడ కార్పొరేషన్ డైరెక్టర్ బడుగు శ్రీకాంత్ అన్నారు. బాధిత కుటుంబానికి మంగళవారం స్థానిక నేతలతో కలిసి రూ.16 వేలు నగదు, 25 కిలోల బియ్యం, కిరాణా సామగ్రి, దుస్తులు అందజేశారు. ఈ కార్యక్రమంలో మల్లి రెడ్డి ప్రసాద్, వెంకట గణేశ్, శివకుమార్, ముసల య్య, సత్తిబాబు, రవికుమార్ పాల్గొన్నారు.



# RAJADHANI CLASSIFIEDS Ad. Call
## 9440662699, rajadhanivartalu.com

### EDUCATIONAL

- కల్లం ఇంజనీరింగ్ కాలేజీ, గుంటూరు, 0863-2119726
- యస్ ఆర్ ఐ అకాడమీ ఆఫ్ సైన్సెస్ అండ్ హాస్పిటల్, మంగళగిరి 08645-230101
- ఎయిమ్స్ హాస్పిటల్, మంగళగిరి 9493065718
- యస్ ఆర్ యమ్ యూనివర్సిటీ, ఏపీ నీరుకొండ, 0863-2429299
- విట్ యూనివర్సిటీ, ఏపీ, ఐనవోలు, 0863-2370444
- IVY Overseas, Vijayawada 73375 55680
- VIVA School, Nambur 0866 668 8999
- అరవింద స్కూల్ వేర్ ఈచ్ చైల్డ్ ఈజ్ స్పెషల్, మంగళగిరి 08645-246878
- Eurekha Child, An AID India Initiative, Chennai 89398 20480
- Adarsha Educational Society Visakhapatnam, 0891-287 4605
- SPRITS Colleges, Kadapa, 9848664650
- Centuriaon University Rollavaka, AP 9840015963

### HOSPITALS

- అష్రఫ్ మెటర్నిటీఇ అండ్ టి మల్టీ స్పెషాలిటీ హాస్పటల్, విజయవాడ డా.యంఎ. రెహమాన్, 0866-2475087
- చింతలూరు ఆయుర్వేదం డాక్టర్ డి.విశ్వనాథ్, 9032990138
- హాసిని మల్టీ స్పెషాలిటీ హాస్పటల్ మందడం, డా. రహీమ్ బాషా 87902 27564
- శాస్త్రి బామ్ ఆయుర్, మంగళగిరి, 7999959999
- Manipal Hospitals, Vijayawada, 0866-2469700
- Sri Sivanath Ayurvedic Clinic Vijayawada, 09440 162256
- Rushad Opticals,Mangalagiri 99667 87654

### MATRIMONIAL

- కావ్యశ్రీ మ్యారేజ్ లింక్స్:1వ, 2వ,లేట్ మ్యారేజెస్, తోడు,సంబధాలు, డైవోర్సీస్, విడోస్, దోయర్స్,పెన్షనర్లకు,అన్ని కులాల వారికీ పోస్ట్ సెటిల్మెంట్లు(స్త్రీలకు ఫ్రీ రిజిస్ట్రేషన్) ఫోన్: 9100669324
- జానీ మ్యారేజ్ లింక్స్, విజయవాడ 985394613
- Post your Alliances ad on Rajadhani Vartalu NewsPaper
- Post your Alliances ad on rajadhanivartalu.com

### REAL ESTATE

- New Sneha Builders & Developers, Kurnool, AP 9440662699
- గాలిసా రియల్ ఎస్టేట్, అమరావతి 9440662699
- Apartments for Sale, Attractive Price,Crystal Constructions, Gated Community, NRI Hospital Road, Srinivasam Apartments, Mangalagiri, 9440662699
- ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల పరస్పర సహాయ సహకార గృహనిర్మాణ సంఘం, 0866-2452129
- ప్రైమ్ లివింగ్ రియల్ ఎస్టేట్ మంగళగిరి, 994860855

### NGO's

- శ్రీ శారదా పీఠం, విశాఖపట్నం 0891-2763332
- జ్ఞానదందం, ఐనవోలు చర్చ్ 8790878542
- ఇమ్మానుయేల్ చర్చ్, ఐనవోలు 9866777439
- Christian Rights Protection Service of India, Vijayawada 79897 88645
- రామయ్య చారిటబుల్ ట్రస్ట్ ప్రెసిడెంట్ బి.రమేష్, మంగళగిరి 0863-999999

### RESTAURENTS

- New Continental Park Hotel Vijayawada, 0866-6679999
- అయ్యూబ్ బిర్యానీ హౌస్, ఇబ్రహీంపట్నం 9502727306
- Hotel Ilapuram, Vijayawada 0866-2575251
- Lemontree Premier, Vijayawada, 0866-6919999
- Bismilla Biryani Point Tadepalli, 6300096288
- Khaleel Bhai Family, Restaurent, Guntur 855087555
- Novotel,Vijayawada 0866-6688999
- నాని స్వీట్స్, మంగళగిరి 8374220220, 9989229799
- Lakshmi Mourya Malkapuram, 9052631122
- Seweet Magic, Mangalagiri 9059323334
- Hello Idly, Mangalagiri 95424 93333
- Chill Out Restaurent Undavalli, 8179549922
- Hotel Park Residency Vijayawada-81216 69996

### COMPANIES

- ఈ-కామర్స్ కన్సల్టింగ్ నవీన్, 9008640610
- Insurence needs for NRI's Call 6305479394
- Hareesh Video Shooting 9666643567
- S RICE Traders Vijayawada 9849741984
- రవికాంత్, ఐటీ కన్సల్టింగ్ 9908188454
- ఎక్ష్టానిక్స్ స్మార్ట్ సొల్యూషన్స్, మంగళగిరి 0866-2466675
- ఐవిస్ ఇ-సర్వీలియన్స్ కంపెనీ మంగళగిరి, 040-40038590
- నవీన్ ఈకామర్స్ కన్సల్టింగ్ 9008640610
- యూ యస్ ఎ స్మార్ట్ డీల్స్ గ్లోవ్స్ మాస్క్స్ 001-2489965595
- సిహెచ్.చంద్రశేఖర రెడ్డి, ది నూతక్కి పాథమికవ్యవసాయ సహకార పరపతి సంఘం లిమిటెడ్, 08645-275239
- ఇన్కమ్ టాక్స్ ప్రాక్టీషనర్లు మంగళగిరి, 789998999
- Visakha Healthcare 92466 46561
- Vivanta, Vijayawada 0866 664 4444
- Minerva Grand 0866 667 8888
- Rain Tree Park, Nambur, ijmprop.com
- Echo Friendly Bags, Hyderabad-92461 69069
- ఏపీ యస్ యస్ డి సి హెల్ప్ లైన్ తాడేపల్లి, 8004252422
- Sri Venkateswara panbrokers, Guntur 0863-2228628
- మధు గ్రాఫిక్స్ డిజైనర్, హైదరాబాద్ 6303728907
- AICA Events, 9133133688
- శ్రీ దుర్గా డిజైనర్స్ లేడీస్ టైలర్స్ మంగళగిరి, 9959308664
- Madeena Trading Company Vijayawada, 9000628426
- పొట్లాబత్తుని శ్రీకాంత్ లక్ష్మి సారీస్, మంగళగిరి 08645-234002
- డిజిటల్ ఎక్సపోనెంట్స్, కిషోర్ digitalexponents.in 7793903754
- చైతన్య జి.జి బ్యాంక్, రాయపూడి గుంటూరు జిల్లా, 08645-244266
- ఏపీ యస్ ఆర్ టి హెల్ప్ లైన్ తాడేపల్లి, 0863-2340678
- జవహర్ ఆటోనగర్ ఆటోమొబైల్ టెక్నికల్ అసోసియేషన్ 9394139239, 8143444459
- Capital Way Residency, Tadepalli, 9493523232
- Lemon Tree Hotel, Vijayawada, 866 691 9999
- For Classifieds ad, Call 9440662699
- Rajadhani Real Estate Plots,Amaravati, AP Buy / Sell 9440662699

RAJADHANIVARTALU.COM
9440662699



# ప్రపంచ డిజిటల్ ఎకానమీలో ఏపీ యువత భాగస్వామ్యం కావాలి.. లోకేశ్ పిలుపు

**విశాఖపట్నం, (రాజధాని వార్తలు):** ప్రపంచ డిజిటల్ ఆర్థిక వ్యవస్థలో ఏపీ యువత భాగస్వామ్యం కావాలని మంత్రి నారా లోకేశ్ పిలుపు నిచ్చారు. ప్రపంచ దిగ్గజ ఐటీ సంస్థ ఐబీఎం నూతన ఐబీఎం కన్సల్టింగ్ ఫ్యూచర్ నౌ సెంటర్ ప్రారంభోత్సవ కార్యక్రమంలో మంత్రి పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఆర్టిఫిషి యల్ ఇంటెలిజెన్స్ (ఏఐ), డిజిటల్ సేవలు, సాంకేతికత ఆధారిత ఆవిష్కర ణలకు ప్రపంచ కేంద్రంగా విశాఖపట్నం ఆవిర్భవించ డాన్ని ఐబీఎం ఫ్యూచర్‌నౌ సెంటర్ తోడ్పాటును అందిస్తోంద న్నారు. సాంకేతిక పెట్టుబడులను ఆకర్షించడంతో పాటు నాణ్య మైన ఉపాధిని సృష్టిం చడం, భవిష్యత్తుకు సిద్ధంగా ఉన్న ప్రతిభను అభివృద్ధి చేయడం, ఏపీ యువత ప్రపంచ డిజిటల్ ఆర్థిక వ్యవస్థలో భాగమయ్యేలా చేసే ఒక సంపూర్ణ పర్యావరణ వ్యవస్థను నిర్మించడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని మంత్రి అన్నారు. ఆంధ్రప్రదేశ్ పట్ల ఐబీఎం చూపుతున్న నిరంతర నిబద్ధతను స్వాగతి స్తున్నామని చెప్పారు. ఏఐ, డిజిటల్ ట్రాన్స్‌ఫర్మేషన్ కోసం విశాఖపట్నాన్ని భారతదేశంలోని అగ్రగామి కేంద్రాలలో ఒకటిగా తీర్చిదిద్దడానికి ఐబీఎంతో కలిసి పనిచేయడానికి ఎదురు చూస్తు న్నామని మంత్రి లోకేశ్ పేర్కొన్నారు. ఏఐ, డిజిటల్ ట్రాన్స్‌ఫర్మేషన్ ప్రాజెక్టులకు మద్దతుగా.. ప్రపంచ వ్యాప్తంగా కన్సల్టింగ్ సేవలు, ఏఐ ఫస్ట్ ట్రాన్స్‌ఫర్మేషన్ ప్రాజెక్టులకు మద్దతుగా ఐబీఎం కన్సల్టింగ్



ఫ్యూచర్‌నౌ సెంటర్‌ను ఏర్పాటు చేశారు. భారతదేశ సాంకేతిక ఆవిష్కరణలు, ప్రతిభావంతులైన మానవ వనరుల అభివృద్ధిపై సంస్థ కొనసాగిస్తున్న పెట్టుబడులకు ఇది మరో కీలక ముంద డుగు కానుంది. ఈ సెంటర్ ద్వారా ప్రపంచ వ్యాప్తంగా ఉన్న ఖాతాదారులకు కన్సల్టింగ్, సాంకేతిక సేవలను అందించనుంది. ఇందులో కృత్రిమ మేధస్సు, హైబ్రిడ్ క్లౌడ్, సాఫ్ట్‌వేర్ ఇంజనీరింగ్, డేటా అండ్ అనలిటిక్స్, సైబర్ సెక్యూరిటీ, ఎంటర్‌ప్రైజ్ ట్రాన్స్ ఫర్మేషన్ వంటి కీలక రంగాల్లో సేవలు అందించనున్నారు. అదేవిధంగా ఏఐ ఆధారిత క్లౌడ్ ట్రాన్స్‌ఫర్మేషన్, ప్లాట్‌ఫార్మ్ ఇంజ నీరింగ్, సర్వీస్ ఇంటిగ్రేషన్, క్వాలిటీ ఇంజనీరింగ్, యూజర్ ఎక్స్‌పీరియన్స్ సేవలకు ఐబీఎం కన్సల్టింగ్ ఫ్యూచర్‌నౌ సెంటర్ ప్రధాన కేంద్రంగా పనిచేయనుంది.

# చంద్రుడిని ఢీకొన్న 4 టన్నుల బరువు ఉన్న స్పేస్‌ఎక్స్ రాకెట్ శకలం!



**ఇంటర్నెట్ డెస్క్:** అంతరిక్షంలో ఓ కీలక ఘటన చోటుచేసుకున్నట్లు తెలుస్తోంది. సుమారు 4 టన్నుల బరువున్న 'స్పేస్‌ఎక్స్' ఫాల్కన్-9 రాకెట్‌కు చెందిన పైభాగపు శకలం చంద్రుడిని ఢీకొన్నట్లు శాస్త్రవేత్తలు భావిస్తున్నారు. దీనివల్ల భూమికి ఎటువంటి ప్రమాదం లేనప్పటికీ, చంద్రుడి ఉపరితలంపై మాత్రం భారీ గుంత ఏర్పడి ఉంటుందని నిపుణులు తెలిపారు. అమెరికా కాలమానం ప్రకా రం గత ఏడాది జనవరిలో చంద్రుడిపైకి ల్యాండర్లను మోసుకెళ్లిన ఫాల్కన్-9 రాకెట్‌కు సంబంధించిన సెకండ్ స్టేజ్ శకలం నిర్దేశిత కక్ష్య నుంచి పక్కకు తప్పుకుంది. సూర్య కిరణాలు, గురుత్వాకర్షణ శక్తి ప్రభావాల కారణంగా ఈ శకలం క్రమంగా తన మార్గాన్ని మార్చుకుని చంద్రుడిని సమీపించిందని స్పేస్‌ఎక్స్ వర్గాలు వెల్ల డించాయి. ఇది గంటకు సుమారు 8,690 కిలోమీటర్ల (5,400 మైళ్ళు) వేగంతో చంద్రుడి ఉత్తర గోళార్ధంలోని ఐన్‌స్టీన్ క్రేటర్ సమీపంలో జాబిల్లిని ఢీకొన్నట్లు అంచనా వేశారు. ఈ అనూహ్య పరిణామంపై నాసాతో పాటు పలు అంతరిక్ష పరిశోధనా సంస్థలు ప్రత్యేక దృష్టి సారించాయి. నాసాకు చెందిన 'ల్యూనార్ రికాన్స జెన్స్ ఆర్బిటర్' ప్రోబ్, సౌత్ కొరియాకు చెందిన 'పాత్‌ఫైండర్' ఆర్బిటర్లు.. శకలం పడిన ప్రాంతాన్ని ఫొటోలు తీసేందుకు సన్నద్ధ మయ్యాయి. రాకెట్ శకలం చంద్రుడిని ఢీకొట్టిన కారణంగా ఏర్పడే ధూళి మేఘాలు, శిథిలాలను అధ్యయనం చేయడం ద్వారా భవిష్యత్తులో జాబిల్లిపై మానవ నివాసాలు ఏర్పాటు చేసే ప్రణాళి కలకు ఇది ఎంతగానో ఉపయోగపడుతుందని శాస్త్రవేత్తలు భావి స్తున్నారు. మరోవైపు ప్రస్తుతం భూమి చుట్టూ సుమారు 17,000 టన్నుల బరువున్న 46,000లకు పైగా అంతరిక్ష వ్యర్థాలు తిరుగుతున్నట్లు యూరోపియన్ స్పేస్ ఏజెన్సీ ఆందోళన వ్యక్తం చేసింది. ఈ వ్యర్థాలు రోజురోజుకూ పెరిగిపోతే భవిష్యత్తులో పెను ప్రమాదాలు సంభవించే అవకాశం ఉందని కొందరు నిపుణులు హెచ్చరిస్తున్నారు. ఏదేమైనప్పటికీ, ఈ ఘటన అంతరిక్ష ప్రయోగాల్లో వ్యర్థాల తొలగింపు, పర్యవేక్షణపై మరోసారి ఆలోచన రేకెత్తిస్తోంది.

# తల్లిపాలు శిశువుకు తొలి రక్షణ కవచం



**చేజర్ల, (రాజధాని వార్తలు):** ప్రపంచ తల్లిపాల వారోత్సవాల సం దర్భంగా చేజర్ల మండలంలోని ఉలవపల్లి, చిత్తలూరు గ్రామాల్లో మంగళవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సంద ర్భంగా తల్లులకు తల్లిపాల ప్రాముఖ్యతపై సూపర్వైజర్ ఎం.పద్మ వివరించారు. బిడ్డ పుట్టిన వెంటనే ముర్రుపాలు ఇవ్వాలని, అవి శిశువుకు తొలి టీకాలా పనిచేసి రోగనిరోధక శక్తిని పెంచుతా యని తెలిపారు. శిశువుకు తొలి ఆరు నెలలు తల్లిపాలు మాత్రమే అందించాలని, ఏడో నెల నుంచి అనుబంధ ఆహారం ప్రారంభిం చాలని సూచించారు. తల్లిపాలు సమృద్ధిగా ఉండేందుకు తల్లులు ఆకుకూరలు, క్యారెట్, పాలు, గుడ్లు, కూరగాయలు, మునగాకు వంటి పోషకాహారం తీసుకోవాలని అవగాహన కల్పించారు. ఈ కార్యక్ర మంలో అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొని తల్లులకు ఆరోగ్య సూచనలు అందించారు.

# రోటరీ క్లబ్ సేవా కార్యక్రమం ద్వారా దుస్తులు పంపిణీ



**తిరుపతి, (రాజధాని వార్తలు):** విద్యార్థులకు విద్యతో పాటు అవస రమైన మౌలిక సదుపాయాలు, ప్రోత్సాహాన్ని అందించాలనే లక్ష్యంతో నాయుడుపేట రోటరీ క్లబ్ మరో సేవా కార్యక్రమాన్ని చేపట్టింది. చిట్టమూరు మండలంలోని గుణపాడు మోడల్ ప్రైమరీ స్కూల్ మరియు మెట్టు పి.పీ.ఆర్. ఉన్నత పాఠశాల విద్యార్థులకు మంగళవారం సుమారు 500 జతల దుస్తులను పంపిణీ చేసింది. ఈ కార్యక్రమానికి అమ్మ ఫౌండేషన్ వ్యవస్థాపకురాలు కృష్ణవేణి సహకారం అందించారు. విద్యార్థులకు కొత్త దుస్తులను అంద జేసిన రోటరీ క్లబ్ సభ్యులు, చిన్నారులతో మమేకమై వారికి విద్యపై ఆసక్తి పెంపొందేలా ప్రోత్సహించారు. ఆర్థికంగా వెనుకబ డిన కుటుంబాలకు చెందిన విద్యార్థులకు ఇలాంటి సేవా కార్యక్ర మాలు ఎంతో ఉపయోగపడతాయని వారు పేర్కొన్నారు. ఈ సందర్భంగా రోటరీ క్లబ్ ప్రతినిధులు మాట్లాడుతూ సమాజ సేవలో భాగంగా విద్య, ఆరోగ్యం, పర్యావరణ పరిరక్షణ, పేదలకు అవసరమైన సహాయ కార్యక్రమాలను నిరంతరం నిర్వహిస్తున్నా మని తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు అవసరమైన సహాయాన్ని భవిష్యత్తులో కూడా కొనసాగిస్తామని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో నాయుడుపేట రోటరీ క్లబ్ అధ్యక్షుడు ఎన్.రామ్మోహన్, కార్యదర్శి కృష్ణారావు, మాజీ అధ్య క్షుడు ఆదవరం నాగురయ్య, ఉపాధ్యక్షుడు శంకర్ లాల్, హ్యూ మన్ రైట్స్ నేషనల్ చైర్మన్ జిలాని భాష, కార్యదర్శి సుధాకర్, చిట్టమూరు ఎంఈఓ బి.వి.కృష్ణయ్య, ప్రధానోపాధ్యాయులు శారదమ్మ, పార్థసారథి, మురళి, పలువురు ఉపాధ్యాయులు, రోటరీ క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

Printed & Published by Pattan Hussain Khan, on behalf of M/S Vastitude Media Pvt.Ltd; Printed at Jagathi Publications Ltd., Sakshi Press, Survey No. 766/2 Ankireddy Palem Village, Guntur Rural, Dist. Guntur-522005, AP; Published at 6-45/1, Thullur Mandal, Guntur Dt,AP-522237; RNI NO: APTEL/2019/77985, Whatsapp: 9440662699,Email: rajadhanivartalu@gmail.com | Web: rajadhanivartalu.com | Founding Editor: Pattan Hussain Khan